RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 3 సంచిక : 1 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 జనవరి 2025 ఆదివారం పేజీలు : 4

### ఆ నగరంలో జిబిఎస్ వ్యాప్తి.. 73కు చేరిన కేసులు..

పుణెలో అరుదైన న్యూరోలాజికల్ డిజార్డర్ అయిన గులియన్-బారే సిండ్రోమ్ ఆరు కొత్త అనుమానిత కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇప్పుడు మొత్తం కేసుల సంఖ్య 73కి చేరుకుంది. వీరిలో 14 మంది వెంటిలేటర్ సపోర్ట్‌తో ఉన్నారు. కేసులు క్రమంగా పెరుగుతుండటంతో అప్రమత్తమయిన ఆరోగ్య శాఖ పరిశోధనలు మొదలుపెట్టింది. ఈ వారం ప్రారంభంలో 24 అనుమానిత కేసులను ప్రాథమికంగా కనుగొన్న తర్వాత దాని కోసం రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ను ఏర్పాటు చేసింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. గులియన్-బారే సిండ్రోమ్ అనేది అరుదైన నాడీ సంబంధిత వ్యాధి. కేసులు పెరుగుతుండటంతో అధికారులు ప్రజలను అలర్ట్ చేశారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అయితే, ఇది అంటువ్యాధి లేదా మహమ్మారికి దారితీయదని స్పష్టం చేశారు.

# తెలంగాణ వాసులకు గుడ్‌న్యూస్..

## నేడే నాలుగు పథకాలు ప్రారంభం



హైదరాబాద్, జనవరి 25: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు సన్నాహకాలు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, గృహ లక్ష్మి (ఉచిత విద్యుత్), రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే మరో నాలుగు పథకాలను తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేసింది తెలంగాణ సర్కార్. అందులో ప్రధానమైనవి కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఈ పథకాల అమలుకు ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది. ఇక ముఖ్యమైన నాలుగు పథకాల అమలు జరిగే తేదీ రానే వచ్చేసింది. రేపే (జనవరి 26) తెలంగాణ సర్కార్ ఆ పథకాలను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామసభలు, సర్వేలు నిర్వహించిన సర్కార్.. అర్హులైన ప్రతీఒక్కరికీ పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకుంది. అలాగే ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఇప్పటికే మంత్రులు స్పష్టం చేశారు.

**కొత్త రేషన్ కార్డులు :** తెలంగాణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించింది. జనవరి 26న కొత్త రేషన్ కార్డులను అర్హులకు జారీ చేయనుంది సర్కార్. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. ఇందు కోసం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది సర్కార్. దీంతో అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు పాత రేషన్ కార్డు మార్పులు, చేర్పులు కూడా చేయనున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన అందరికీ ఆహార భద్రతా కార్డులను అందించనుంది సర్కార్.

**రైతు భరోసా :** ఈనెల 26 నుంచి తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా అందించాలని సర్కార్ నిర్ణయించింది. సాగుకు అనుకూలమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ.12 వేలు అందించనుంది. ఇందుకోసం ఈనెల 20 వరకు సర్వే నిర్వహించిన అధికారులు.. సాగుకు అనుకూలం కాని భూముల లిస్టును గ్రామ పంచాయతీల్లో ఉంచారు. ఈనెల 26న అంటే రేపు రైతు భరోసాకు అర్హులైన వారి ఖాతాల్లోకి డబ్బులు జమకానున్నాయి.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా :** రాష్ట్రంలో భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రెండు విడతల్లో రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క గుంట కూడా భూమి లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులుగా ఉండనున్నారు. ఈ పథకం కూడా జనవరి 26 నుంచి మొదలు కానుంది.

**ఇందిరమ్మ ఇళ్ల పథకం..** గణతంత్ర దినోత్సవం (జనవరి 26) రోజు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుంది తెలంగాణ సర్కార్. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 80.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కోసం క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10.72 లక్షల దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 7.80 లక్షల దరఖాస్తుల ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. మిగిలిన దరఖాస్తుల పరిశీలనకు మరో వారం రోజు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కోసం పలు విడతల్లో రూ.5 లక్షలు ఇవ్వనుంది తెలంగాణ సర్కార్.

### నాలుగు పథకాల ప్రారంభోత్సవం పండగలా జరపాలి: సీఎస్ శాంతి కుమారి



హైదరాబాద్: రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవం పండగ వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభించాలని చెప్పారు. కొత్త పథకాల ప్రారంభంపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధదారులకు నాలుగు పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. గ్రామానికి మండల ప్రత్యేక అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించాలని, ఒక్కో పథకానికి ఒక అధికారికి బాధ్యత అప్పగించాలని సీఎస్ తెలిపారు. రేషన్‌కార్డులకు తహసీల్దార్, ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో నేతృత్వంలో బృందాలను నియమించాలని చెప్పారు. రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ పథకం ఏపీవో బృందం పర్యవేక్షించాలని సీఎస్ తెలిపారు. లబ్ధిదారుల జాబితాను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ సభలకు అర్హులైన లబ్ధిదారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పథకానికి సంబంధించి లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని తెలిపారు.

### ఆయన బతికే ఉన్నారు.. మావోయిస్టుల సంచలన లేఖ

వరంగల్ : పూజార్ కంకేర్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. ఛత్తీస్‌గఢ్ దక్షిణ బస్తర్ కాంకేర్, మారేడుబాక అడవుల్లో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఇటీవల ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సెక్రటరీ దామోదర్ అలియాస్ బడే చొక్కారావు మృతిచెందినట్లు జరుగుతున్న ప్రచారాన్ని మావోయిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ చనిపోలేదని ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. సౌత్ జోన్ కమిటీ కార్యదర్శి సోమ్ తేర్ సమత పేరుతో లేఖ విడుదల చేశారు. పోలీసులు కావాలనే ఫేక్ లెటర్ క్రియేట్ చేశారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మరణించారని వెల్లడించింది. వారిలో నలుగురు మావోయిస్టులు కాగా మరో నలుగురు గ్రామస్తులు ఉన్నారని తెలిపింది. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర బలగాలు అరాచకం సృష్టిస్తున్నాయని మావోయిస్టు పార్టీ పేర్కొంది. జనవరి 16,17 వ తేదీల్లో 8వేల మంది భద్రతాబలగాలతో 4 గ్రామాలపై దాడులకు పోలీసులు పాల్పడ్డారని చెప్పింది. జనాల్లో అయోమయం సృష్టించేందుకు పోలీసులు ప్రయత్నం చేశారని విమర్శించింది. పోలీసులు బూటకపు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది. దామోదర్, ఇతర సహచరులు క్షేమంగా ఉన్నారని స్పష్టం చేసింది.




### మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోంది: రాష్ట్రపతి ముర్ము

ఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. "ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోంది. అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాలి. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకొన్నాం. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకున్నాం. ఈ ఏడాది కొత్త చట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చాం" అని రాష్ట్రపతి తెలిపారు.



## టూర్ నుంచి విజయోత్సాహంతో తిరిగొచ్చిన తెలుగు ముఖ్యమంత్రులు

# క్షేమంగా వెళ్ళారు... లాభంగా వచ్చారా!?

## పెర్ఫామెన్స్‌లో ఇద్దరూ ఇద్దరే!..

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు-2025.. వేదిక స్విట్జర్లాండ్ మహానగరి దావోస్.. కార్పొరేట్ పెట్టుబడుల్ని ఒడిసిపట్టే చాకచక్యానికి పరీక్షా స్థలం. ఈ రంగస్థలంలో ఈసారి ఆవిష్కృతమైన అరుదైన దృశ్యం.. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకేసారి పాల్గొనడం.. కార్యశూరులని, రాజకీయాల్లో గురుశిష్యులని ఇద్దరికీ పేరుబడ్డం.. తమతమ రాష్ట్రాల భవిష్యత్తు కోసం తన-మన బేధాలు మరిచి పెట్టుబడుల వేటలో పోటీపడ్డం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. ఇద్దరూ తమతమ బృందాలతో దావోస్‌కి తరలివెళ్లారు. ఇద్దరి లక్ష్యం ఒక్కటే పెట్టుబడుల సమీకరణ.. దాంతో ఒనగూడే పారిశ్రామిక ప్రగతి. ఒకరి చేతిలో ప్రగతిపథంలో వేల యోజనాలు ముందుకు దూసుకుపోయిన విశ్వనగరం హైదరాబాద్. మరొకరి చేతిలో మాత్రం తప్పటడుగులు వేస్తూ శైశవ దశను దాటని రాజధాని అమరావతి నగరం. మరి.. ఇద్దరికీ పొంతనెక్కడ..? ఐనాసరే.. దావోస్ వేదికపై రెండు రాష్ట్రాల మధ్య పోటీతత్వం అనివార్యమైంది. మరొక్కమాటలో చెప్పాలంటే.. పెట్టుబడుల్ని ఆకర్షించడం తెలంగాణ ప్రభుత్వానికి నల్లేరు మీద నడకే. ఎందుకంటే.. హైటెక్ హంగులు, మెట్రో, ఓఆర్ఆర్ లాంటి మేలి మెరుగులున్న మహానగరం.. రేపటిరోజున రాబోతున్న ఫ్యూచర్‌సిటీ.. కార్పొరేట్ శక్తుల్ని ఇట్టే ఆకట్టుకునే వనరులు. కానీ.. అర్బనీకరణలో స్పష్టమైన కొరతలున్న ఆంధ్రప్రదేశ్‌కి మాత్రం ఇన్వెస్ట్‌మెంట్‌ని రాబట్టుకోవడం అనేది అతిపెద్ద సవాల్. నిజానికి ఇది చంద్రబాబునాయుడికి అగ్నిపరీక్ష లాంటిది. అందుకే.. సుస్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక.. రాష్ట్ర భవిష్యత్తుపై తనదైన విజన్.. ఇవి మాత్రమే ఆయుధాలుగా వేట కొనసాగించారు. తన అనుభవ సారాన్నంతా ప్రయోగించి.. దావోస్ నుంచి లాభంగా తిరిగి రావాలని తాపత్రయపడ్డారు. ఇటువంటి విచిత్రమైన పరిస్థితుల్లో ఇద్దరు ముఖ్యమంత్రుల దావోస్ పర్యటనపై సహజంగానే ఫోకస్ పెరిగింది. ఇద్దరు నేతల మూడురోజుల దావోస్ పర్యటన ఫలితాల్ని కూడా తూకం వేయక తప్పని పరిస్థితి.

**తెలంగాణ విషయానికి వస్తే....** కేవలం మూడు రోజుల్లో లక్షా 30 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించి డీల్స్ ఓకె చేసుకున్నారు. నిజానికి ఇదొక రికార్డ్. ఇవన్నీ ఒక ఎత్తయితే.. చివర్లో నాలుగవ రోజు ఏకబిగిన 91 వేల 500 కోట్ల డీల్స్ ఓకే కావడం అనేది నభూతో నభవిష్యత్ అని చాటుకుంటోంది తెలంగాణ సర్కార్. అమెజాన్ 60 వేల కోట్లు, టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ 15 వేల కోట్లు, అక్షత్ గ్రీన్‌టెక్ 7 వేల కోట్లు, ఉర్సా క్లస్టర్స్ 5 వేల కోట్లు, బ్లాక్ స్టోన్ 4,500 కోట్లు.. ఇలా డే-4ని కూడా బ్లాక్‌బస్టర్‌గా మార్చుకుంది టీ-సర్కార్. ఇప్పటికే తెలంగాణలో పాతుకుపోయిన ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు.. భారీ స్థాయిలో విస్తరణ ప్రణాళికలు ప్రకటించేశాయి. HCL సంస్థ కూడా తెలంగాణ పెవిలియన్‌లోకొచ్చి.. బంపరాఫర్లు ఇచ్చేశారు. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో HCL టెక్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి డీల్ కుదిరింది. వీటి ద్వారా పాతిక వేల మందికి పైగా ఉద్యోగాలొస్తాయని చాటింపు వేసుకుంటోంది రేవంత్ ప్రభుత్వం. దావోస్ డీల్స్ అన్నీ కార్యరూపం దాల్చి.. పెట్టుబడులన్నీ క్షేత్రస్థాయికి దిగొస్తే.. రాష్ట్రంలో 49 వేల 500 మందికి పైగా ఉద్యోగావకాశాలు వస్తాయన్నది ఒక అంచనా. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఆర్ఆర్ఆర్ నిర్మాణం, మెట్రో విస్తరణ.. ఇవన్నీ కలిసి ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను హైదరాబాద్ వైపు ఆకర్షింపజేశాయి. నా పోటీ ఏపీతో గాని, మహారాష్ట్రతో గాని, కర్నాటకతో గానీ కాదు.. న్యూయార్క్, టోక్యో లాంటి గ్లోబల్ సిటీస్‌తోనే తలపడుతున్నా అంటూ గ్లోబల్ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూల్లో చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. మొత్తానికి కార్యసాధకుడిగా తిరిగొచ్చారంటూ సీఎం రేవంత్‌కి హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలికింది కాంగ్రెస్ క్యాడర్. కానీ.. ఇదంతా హైపే తప్ప హోప్ లేదంటూ విపక్షాలు వ్యతిరేక రాగం అందుకున్నాయి.

**ఏపీ విషయానికి వస్తే...** మై ఏపీ.. మై అమరావతి.. మై విజన్.. ఇదీ నినాదం. మెరుపుకలలు కనడం.. వాటిని సాకారం చేసుకోవడం.. ఇదీ కార్యాచరణ. ఫలితం గురించి ఆలోచించకుండా.. గమ్యం వైపే నా ప్రయాణం.. అంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. అందుకే.. మధురస్మృతులు, అమూల్యమైన భరోసాలతో పండగలా సాగింది చంద్రబాబు దావోస్ టూర్. అసలే ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం. రేవంత్‌రెడ్డితో పోలిస్తే చంద్రబాబుకు పరిచయాలు కూడా ఎక్కువ. ఒక్కోసారి కార్పొరేట్ లాబీయింగ్‌లో పాత పరిచయాలు కూడా వర్కవుటౌతాయి. అలాగని నాయకుని ఇమేజ్‌ని బట్టే పెట్టుబడులు వచ్చేస్తాయన్న నమ్మకాలూ లేవు. అందుకే.. ప్లస్‌లూ, మైనస్సుల్ని లెక్కలేసుకుంటూ.. తనేంటో ప్రూవ్ చేసుకుంటూ.. అంతర్జాతీయ కంపెనీలతోపాటు ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలతో సమావేశమౌతూ.. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచే ప్రయత్నం చేస్తూ మూడురోజులపాటు దావోస్ టూర్‌ని దిగ్విజయంగా ముగించారు చంద్రబాబు. ఏపీ బ్రాండ్ బిల్డింగ్‌పై ఫోకస్ పెడుతూ సాగింది సీఎం చంద్రబాబు దావోస్ టూర్. దావోస్ నుంచి తిరుగుపయనమై గురువారం అర్థరాత్రి ఢిల్లీకి చేరుకున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో గంటపాటు సమావేశమయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సహకారం, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ అమలు.. ఇలా అనేక అంశాలపై చర్చించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కూడా కలిశారు ఏపీ సీఎం చంద్రబాబు. ఇటు.. చంద్రబాబు దావోస్ టూర్‌పై ఏపీలో హాట్‌హాట్ చర్చ జరుగుతోంది. ప్రపంచ వాణిజ్య సదస్సు అంటే రాజకీయ, పారిశ్రామిక ప్రతినిధులు కలిసి కూర్చుని, ఒకర్నొకరు పరిచయం చేసుకుని.. తమతమ వాణిజ్య పాలసీల్ని షేర్ చేసుకుని, వ్యాపార అవకాశాల్ని ఆవిష్కరించుకునే వేదిక. మరో మాటలో చెప్పాలంటే.. దావోస్‌లో పెట్టుబడుల ముచ్చట్లంటే పెళ్లిచూపుల్లాంటివి. కులగోత్రాలు చెప్పుకుని, కట్నకానుకల్ని మాట్లాడుకుని తిరిగొచ్చేయడమే. ప్రతీ పెళ్లిచూపులూ సక్సెస్సయ్యి పెళ్లిదాకా దారితియ్యవు. దావోస్‌లో జరిగే వాణిజ్య ఒప్పందాలు కూడా అంతే. వాటిమీద పెద్దగా నమ్మకాలు పెట్టుకోవద్దని చెప్పే తార్కాణాలు గతంలో బోలెడన్ని. అందుకే.. తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న బిగ్ డీల్స్ మీద, కార్పొరేట్ జెయింట్స్‌తో ఏపీ సర్కార్ జరిపిన సమావేశాల మీద చర్చ అవసరమా లేదా అనేది ఒకానొక హైపొథెటికల్ క్వశ్చన్.

## సంపాదకీయం

# మోడీ కల తీరలేదు..

## ఆ పాలిటిక్సే కొంప ముంచాయా?

ప్రధాని నరేంద్ర మోడీ .. ఈ సారి జరిగిన ప్రపంచ పెట్టుబడుల సదస్సుపై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. వసుధైక కుటుంబం థీమ్‌తో ఆయన ఈ సదస్సులో ప్రపంచ దేశాల వాణిజ్య, వ్యాపార వేత్తలను ఆకర్షించి.. సెమీ కండక్టర్ రంగంలోనే కాకుండా.. ఏఐలోనూ పెట్టుబడులు పెట్టించాలని భావించారు. ఈ క్రమంలోనే గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఐదుగురు కేంద్ర మంత్రులను ఈ సదస్సుకు పంపించారు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న దావోస్ పర్యటనకు ఈ బృందం తరలి వెళ్లింది. వీరిలో అశ్వినీ వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, సీఆర్ పాటిల్ వంటి దిగ్గజ నాయకులు ఉన్నారు. అయితే.. ఇప్పటి వరకు నాలుగు రోజుల పాటు జరిగిన సదస్సులో భారత్కు ప్రత్యేకంగా ఒరిగిన లబ్ధి అంటూ ఏమీ కనిపించలేదు. రాష్ట్రాలపరంగా చూసుకుంటే.. బీజేపీ పాలిత మహారాష్ట్రకు కేవలం 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. కేంద్రం పరంగా చూసుకుంటే.. ఒక్క సంస్థ కూడా ముందుకు రాలేదు. కేవలం వస్తామని మాత్రమే హామీలు గుప్పించాయి. ఇక, కాంగ్రెస్ పాలిత తెలంగాణకు మాత్రం ఊహించని విధంగా అంచనాలకు మించి పెట్టుబడులు లభించాయి. దీంతో భారత్ తరఫున దావోస్‌కు వెళ్లిన కేంద్ర బృందం ఉత్తచేతులతోనే తిరిగి రానుంది. ఇప్పటికే ఇద్దరు మంత్రులు తిరిగి వచ్చేశారు. మరి దీనికి కారణం ఏంటి? మోడీ పెట్టుకున్న కలలు ఎందుకు సాకారం కాలేదన్న చర్చ తెరమీదికి వచ్చింది. అంతర్గత రాజకీయాలు.. ఐటీ దాడులు.. ఈడీ దాడులు సీబీఐ కేసులు వంటివి ప్రధానంగా భారత్ ఇమేజ్‌ను మసకబారుస్తున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బీజేపీ యేతర పార్టీలు పాలన సాగిస్తున్న రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులపై పెద్ద ఎత్తున అంతర్జాతీయంగా చర్చ జరగడం.. బీబీసీ వంటి సంస్థలను నియంత్రించేలా చర్యలు ఉండడం.. అంతర్జాతీయ పెట్టుబడి దారుడుగా ఉన్న గౌతం అదానీ వ్యవహారం ఇటీవల కాలంలో వివాదం కావడం వంటివి ప్రపంచ వాణిజ్య, వ్యాపార వేత్తలను ప్రభావితం చేస్తున్నాయన్నది ఆర్థిక నిపుణుల అంచనా. తమకు సుస్థిర త్వం కోరుకునే వ్యాపారులు ఈ క్రమంలో భారత్‌ను పక్కన పెట్టారన్న విషయాన్ని కూడా వారు చెబుతున్నారు.




## పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించిన అధికారులు

శామీర్ పేట, (గరుడ వార్త) : అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. శనివారం ఉమ్మడి శామీర్ పేట మండలంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటు హక్కు లేని అర్హులైన యువతి, యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఎన్నికల్లో యువత స్వేచ్ఛగా ఓట్లు వేసి సమర్థవంతమైన నాయకులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఓటర్లు ఎన్నికల్లో నిజాయతీగా తమ ఓటు హక్కు వినియోగించుకుని సమాజాభివృద్ధికి చేయూతనివ్వాలని అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా అధికారులు, మాజీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి ఓటర్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల తహసిల్దార్ యాదగిరి రెడ్డి, మూడు చింతలపల్లి మండల తహసిల్దార్ వెంకట నరసింహారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ నాగజ్యోతి, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.






హుస్నాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో నిధులు మంజూరైన పనులకు టెండర్లు పిలవగా గుత్తేదార్లు ముందుకు రాలేదు. అధికారులు మరోసారి టెండర్లు పిలిచి జనవరి 3వ తేదీని గడువుగా నిర్ణయించారు. అధ్వాన స్థితిలో ఉన్న పంచాయతీ రాజ్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. నవంబరులో నిర్వహించిన ఆన్‌లైన్ టెండరుకు ఎవరూ వేయలేదు. ఆసక్తి ఉన్న గుత్తేదార్లు టెండర్లు వేయడానికి గత నవంబరు 20 గడువు నిర్ణయించారు. ఆ గడువుకు ఎవరూ టెండరు వేయలేదు. ఇంజినీరింగు అధికారులు మళ్లీ నిర్వహిస్తున్నారు.

**కొత్త సంవత్సరంలో తేలేనా!**

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు లభించడమే గగనంగా ఉన్న పరిస్థితుల్లో పనులు చేపట్టేందుకు గుత్తేదార్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గుత్తేదార్లు ముందుకు రాకపోవడానికి వివిధ కారణాలు ఉన్నాయనే భావన వ్యక్తం అవుతోంది. ఈ పనులు చేస్తే బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కావచ్చని కొందరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మరోవైపు గుత్తేదార్లు సిండికేట్ కావడం వల్ల ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. టెండర్లలో పనులు చేపట్టడానికి గుత్తేదార్లు జిల్లాలను కేటాయించుకున్నట్లు సమాచారం. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలికల పనులను కేటాయించుకున్న విధంగా వారు మాత్రమే వేస్తున్నారు. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ కారణంగానే ప్రస్తుతం దాఖలు కాలేదని చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈఈ మహేశ్‌ను సంప్రదించగా టెండరు దశలో ఉన్నాయని తెలిపారు. జనవరిలో టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

పనులు జరగాల్సిన మండలాలు – 3
రహదారులు, వంతెనల పనులు – 16
మంజూరైన గ్రాంటు నిధులు – రూ.15.04 కోట్లు
5.5 కి.మీ. పందిల్ల–పొట్లపల్లి–హుస్నాబాద్ రెండు వరుసల రోడ్డు – రూ.3.95 కోట్లు
తోటపల్లి–పూసవర్లపల్లి మధ్య వంతెన – రూ.1.49 కోట్లు
కోహెడ–కూరెల్ల–తంగళ్లపల్లి చౌరస్తా – రూ.1.55 కోట్లు
తీగలకుంటపల్లి–శ్రీరాములపల్లి – రూ.1.50 కోట్లు
అక్కన్నపేట–సంజీవరాయ కాలనీ – రూ.1.40 కోట్లు
పీడబ్ల్యూడీ రోడ్డు, చౌటపల్లి, మల్లంపల్లి దారి పనులు – రూ.1 కోటి
జడ్పీ రోడ్డు, పరికిబండ మార్గం – రూ.50 లక్షలు
మూడు మండలాల్లో ఇతర పనులు – రూ.3.65 కోట్లు

# పదిరోజులే గడువు.. పడతలేదు అడుగు



హుజూర్‌నగర్: రూ.కోట్ల విలువ చేసే ధాన్యం ఇవ్వాల్సి ఉన్నా స్పందన లేకపోవడంతో ప్రభుత్వానికి వేలం ధాన్యం వసూలు చేయడం పెద్ద సమస్యగా మారింది. సూర్యాపేట జిల్లాలో కేవలం 14 శాతం మాత్రమే వసూలు కాగా.. నల్గొండ జిల్లా నుంచి 54 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 65 శాతం మిల్లర్లు అప్పగించారు.

వేలం వేసిన ధాన్యం గుత్తేదారుకు అప్పగించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నా మిల్లర్ల నుంచి స్పందన లేదు. మిల్లర్లు తీసుకున్న సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేసిన సంగతి తెలిసిందే. ఆ ధాన్యం డిసెంబరు 31 వరకు అప్పగించాలని గడువు విధించినా కొండలా ఉన్న లక్ష్యం మాత్రం కదలడం లేదు. గడువులోగా ఇవ్వకుంటే 25 శాతం జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా మిల్లర్లు వేలం ధాన్యం ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. పది రోజులే గడువున్నా నామమాత్రంగానే అప్పగించారు. ఈ ధాన్యం రాబట్టడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. మరో వైపు వేలం వేసిన ధాన్యం తమకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వేలం బాకీ చెల్లిస్తామని గుత్తేదారు అంటున్నాడు.

**పది నెలలుగా ఇదే తంతు..**

యాసంగిలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు. వర్షాలు పడటం, ధాన్యంలో నాణ్యత లేదని తాము సీఎంఆర్ పెట్టలేమని మిల్లర్లు చేతులెత్తేశారు. ప్రభుత్వం ఆ ధాన్యాన్ని టెండరు ద్వారా 11 నెలల క్రితం వేలం వేసింది. అమ్మిన ధాన్యం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ మిల్లుల్లో ఉంది. కొందరు మిల్లర్లు ధాన్యం అప్పగించారు. కొందరు గుత్తేదారు కోట్ చేసిన ధరను నగదు రూపంలో చెల్లించారు. ఎక్కువ సంఖ్యలో మిల్లర్లు గుత్తేదారుకు అప్పగించేందుకు రకరకాలుగా కొర్రీలు పెడుతూ వస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 7,89,275 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని వేలం వేసింది. దక్కించుకున్న గుత్తేదారు 3,28,545 మెట్రిక్ టన్నులు మాత్రం స్వాధీనం చేసుకున్నారు. ఇంకా 4,60,730 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల దగ్గరే ఉంది.

**రకరకాలుగా కొర్రీలు**

మిల్లుల్లో ధాన్యం ఉంటే వెంటనే అప్పగించాలని లేదా మిల్లర్లు గుత్తేదారు డబ్బు చెల్లించాలన్నారు. ఈ షరతుతో ఇప్పటికే కొందరు మిల్లర్లు నగదు చెల్లించగా, ఇంకొందరు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అప్పగించారు. ఎక్కువ మంది మిల్లర్లు స్పందించడం లేదు. మిల్లుల్లో దీర్ఘకాలం నిల్వ చేయటం వల్ల అవి పూర్తిగా నాణ్యత కోల్పోయాయని, వాటిని కాంట్రాక్టరు తీసుకోవడం లేదని కొందరు అంటున్నారు. కొన్ని మిల్లుల్లో ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యం వేలం వేసే సమయానికే ధాన్యం అమ్ముకున్నట్లు సమాచారం.

# మారాలి మనం.. కేరళలా..!

సూర్యాపేట : ఈ తరుణంలో దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళ అనుసరిస్తున్న విధానాలతోనే సర్కారు పాఠశాలలు బలోపేతం చేయవచ్చని విద్యారంగ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం పట్టణాలకు బస్సుల్లో తమ పిల్లల్ని పంపుతుండగా సంఖ్య తగ్గిపోతుంది. మరోవైపు గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ విద్యా సంస్థల్లో పోటీ పరీక్షలు రాసి నిరుపేద విద్యార్థులు చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య ఏటా తగ్గిపోతోంది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా 3,151 మంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోయింది.

సూర్యాపేట జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం 4,522 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

కేరళ విద్యారంగం విధానాలు మచ్చుకు కొన్ని...

దేశంలోనే మొదటిసారి 2007లో ఈ సూచనలను కేరళ వంద శాతం అమలు చేసి విజయం సాధించింది.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

5 కిలోమీటర్లను యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. అన్ని వసతులు, తరగతి గదులు కల్పించారు.




కేరళలో 40వేల జనాభా దాటిన చోట ఒక్క ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నారు. ఐదంచెల విధానంలో తనిఖీ చేసిన తరువాతే ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇస్తూ పూర్తిగా నియంత్రించారు. కేరళలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 10 శాతం మిషనరీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉండగా కేవలం 10 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

'తల్లిదండ్రులు, టీచర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి..వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. ప్రతి 2 నెలలకు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు.

ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నిధులలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవోకు ఉండే అధికారాలు కల్పించారు. క్రమశిక్షణ పాటించని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌తో పాటు సర్వీసు నుంచి తొలగించే అధికారాలు ఉంటాయి.

జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 2005లో విద్యారంగ ప్రమాణాల పెంపునకు గాను 2005 జాతీయ పాఠ్యపుస్తకాల నిర్ణయ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా రాష్ట్రాలలో పూర్తి అధ్యయనం తరువాత ప్రాంతీయ భాషకు, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక స్థితిగతులు, స్థానిక పరిస్థితులను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆదేశించారు.

# సమీకృతం.. సగం సగం..!

నల్గొండ : పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం అటకెక్కింది. గత ప్రభుత్వం కూరగాయలు, మాంసాహారం తదితరాలు అన్నీ ఒకేచోట విక్రయాలు జరగాలని భావించి సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట, నల్గొండ మినహా అంతటా పనులు పడకేశాయి. పునాదులకే పరిమితమయ్యాయి. కేటాయించిన నిధులు కూడా మంజూరు కాక నిర్మాణం కలగానే మారింది. పూర్తయిన రెండు చోట్ల ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రూ.కోట్లు కేటాయించినా నిష్ఫలం కావడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే విక్రయాలు**

సూర్యాపేటలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.30.18 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. గతేడాది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు వ్యాపారులు అక్కడ విక్రయాలు చేపట్టడం లేదు. ఆరుబయటనే తమ క్రయవిక్రయాలు చేపడుతున్నారు.

**నల్గొండలో నిరుపయోగంగా..**

నల్గొండలో రూ.8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

**అదనపు నిధులు మంజూరైనా..**

చిట్యాలలో ఇన్‌గ్రాంట్ బడ్జెట్ కింద 2021లో రూ.2 కోట్ల అంచనాతో సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించారు. డిజైన్ మాత్రం రూ.5 కోట్లకు రూపొందించారు. అదనంగా రూ.3 కోట్ల నిధులు మంజూరైనా గుత్తేదారుతో అదనపు నిధుల పనుల ఒప్పందం జరగలేదు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్లాబ్‌ల వరకు పనులు జరిగాయి.

నకిరేకల్‌లో రూ.2 కోట్లతో ప్రారంభించి రెండు స్లాబుల వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో జాప్యం కారణంగా గుత్తేదారును మార్చి మరొకరికి అప్పగించినా ముందుకు సాగటం లేదు.

దేవరకొండలో రూ.4.5 కోట్లు మంజూరవగా స్థల సమస్యతో కొంతకాలం వాయిదా పడింది. ప్రస్తుతం అంచనా విలువ రూ.11 కోట్లకు పెంచారు. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

హాలియాలో రూ.2 కోట్లతో పనులు చేపట్టగా స్లాబ్ వరకు నిర్మించారు. అంచనా వ్యయం రూ.5 కోట్లకు పెంచారు. పనులు నిలిచిపోయాయి.

**బిల్లులు అందక.. పనులు సాగక**

చండూరులో పిల్లర్ల దశ వరకే నిర్మించారు. దీని నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగతా పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి.

మిర్యాలగూడలో రూ.1.20 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగానే ఉంది. ఇక్కడ కూడా నిధులు సరిపడక పనులు ముందుకు సాగటం లేదు.

భువనగిరిలో రూ.8.40 కోట్ల అంచనాతో చేపట్టగా నిధుల కొరత కారణంగా నిర్మాణం ముందుకుసాగటం లేదు.

ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికలలో ఒక్కో దానికి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

**రాకపోకలకు ఇబ్బంది...**

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు, సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు రావడంతో దారి మళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జనసందడి పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.

# గురుకులం పిలుస్తోంది

ధర్మపురి : వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు విధానంలో పలు మార్పులు చేశారు. ఇంతకుముందు ఆధార్‌కార్డు, ఫొటో, విద్యార్థి సంతకం ఉంటే సరిపోయేది. ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం విద్యార్థి దరఖాస్తు చేసుకునే సమయంలోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫొటో, జనన ధ్రువీకరణ పత్రం లేదా ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంది. గతంలో వివిధ గురుకులాలకు వేరు వేరుగా దరఖాస్తు విధానం ఉండగా తాజా నోటిఫికేషన్‌లో అన్నింటికీ కలిపి ఒకే నోటిఫికేషన్ విడుదల చేసి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆరు నుంచి తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు వేరు వేరు సమయాల్లో దరఖాస్తులను తీసుకునే వారు. ఇప్పుడు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఏ తరగతిలో ప్రవేశం పొందాలో స్పష్టంగా తెలుపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గతంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత వారం రోజుల ముందు హాల్ టికెట్లను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు



దరఖాస్తు పూర్తియిన వెంటనే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతోంది.

**చివరి గడువు ఫిబ్రవరి 1**

గత నెల డిసెంబర్ 21వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకాగా 01-02-2025 వరకు గడువు ఉంది. ఫిబ్రవరి 23న అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ఈ సారి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం జతచేయాల్సి రావడంతో వీటి కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి వారం నుంచి పది రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నందున గడువు తేదీకంటే ముందుగానే అన్నింటినీ సిద్ధం చేసుకుంటే ఇబ్బందులు ఉండవు.

**కావాల్సిన పత్రాలు**అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థి ముందుగా ఫోన్ నెంబరు నమోదు చేయాలి. అనంతరం ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతోంది. ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, జనన ధ్రువీకరణ లేదా ప్రభుత్వం ఆమోదించిన గుర్తింపు పత్రం కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలవారైతే రూ.2 లక్షల లోపు ఉండాలి.

**రుచికరమైన భోజనం..**గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబా టులో ఉన్నాయి. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. నూతన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం విద్యార్థులకు అందుతోంది. పౌష్టికాహారంలో భాగంగా నెలలో నాలుగు సార్లు కోడికూర, రెండు సార్లు మటన్‌తో పాటు ప్రతీరోజు గుడ్డును అందిస్తారు. ఉదయం అల్పాహారంతో పాటు బూస్ట్, ఉదయం, సాయంత్రం విశ్రాంతి సమయ ంలో స్నాక్స్ అందిస్తున్నారు. ఉదయం, రాత్రి భోజనంలో పప్పు, ఒక కూర, చారు, నెయ్యి, పెరుగు అందిస్తారు. ప్రతీ గురుకులంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండటంతో క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఉంటుంది.

# డంపింగ్ యార్డుకు వీడని గ్రహణం

గోదావరిఖని : రామగుండం నగరపాలికకు డంపింగ్ యార్డు సమస్య తీరడం లేదు. 11ఎ బొగ్గుగని సమీపంలోని సింగరేణి స్థలాన్ని కొన్నేళ్లుగా డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నారు. గని విస్తరణలో స్థలాన్ని సంస్థ స్వాధీనం చేసుకోవడంతో నగరపాలికకు డంపింగ్ యార్డు సమస్య తీవ్రమైంది. తాజాగా మూతపడిన మేడిపల్లి ఉపరితల గని సమీపంలో సింగరేణి యాజమాన్యం స్థలం కేటాయించడంతో డంపింగ్ యార్డు కోసం నగరపాలిక ఏర్పాట్లు చేస్తుండగా స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ సారి ఈ స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయిస్తున్నారని తెలియగానే స్థానిక కార్పొరేటర్లతో పాటు స్థానికులు సింగరేణి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పూర్తిగా మల్కాపూర్, జంగాలపల్లి, మేడిపల్లి తదితర గ్రామాల పక్కనే డంపింగ్ యార్డుకు కేటాయిస్తే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందనే అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ మేరకు సింగరేణి, నగరపాలక అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా స్థలాన్ని చదును చేస్తున్న యంత్రాలను స్థానికులు అడ్డుకున్నారు.

**ప్రభుత్వ స్థలం కొరత**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాలను స్థానిక పరిశ్రమల కోసం కేటాయించడంతో నగర పరిసరాల్లో ప్రభుత్వ స్థలమే కరవైంది. ఆయా పరిశ్రమలు స్పందిస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి పనుల కోసం స్థలం లభించే పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా డంపింగ్ యార్డులు జనావాసాలకు దూరంగా ఉండాల్సి ఉండగా ఇక్కడ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే నగరంలో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశముంది. మొదట్లో మూతపడిన మేడిపల్లి ఉపరితల గని క్వారీని డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తారనే సమాలోచనలు సాగగా స్థానికంగా పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. తాజాగా క్వారీ కాకుండా ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని డంపింగ్ యార్డుకోసం చదును చేస్తుండటంతో స్థానికులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. క్వారీలో వాహనాలు వెళ్లేలా ర్యాంపులు ఏర్పాటు చేసుకొని చెత్తను అందులో పడేస్తే తమకెలాంటి అభ్యంతరం లేదనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సింగరేణి, నగరపాలక అధికారులు పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే కొంత మేరకు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. గతంలో రామగుండం, లక్ష్మీపురం, పీకే రామయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్త వేయడంపై ఆయా ప్రాంతవాసులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు ఆందోళనకు దిగి వాహనాలను అడ్డుకున్నారు. గత్యంతరం లేకపోవడంతో గోదావరి ఒడ్డున సమ్మక్క జాతర స్థలాన్ని డంపింగ్ యార్డుగా వాడుకున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో సమ్మక్క జాతర ప్రాంగణంలో మట్టిపోసి చదును చేసి జాతరకు సిద్ధం చేశారు. చెత్తను గోదావరి ఒడ్డున గల ఆర్.ఎఫ్.సి.ఎల్. ఇన్‌టేక్ వెల్ స్థలంలో వేస్తున్నారు. వారు సైతం అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించేంత వరకు తాత్కాలికంగా వినియోగిస్తామని చెప్పడంతో విషయం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇప్పుడు అటువైపు నుంచి సైతం ఒత్తిళ్లు వస్తున్నాయి.

# ఆ వైద్యులు ఎవరు.. ఎక్కడ..?



హైదరాబాద్: నగరంలోని సరూర్‌నగర్ కొత్తపేట అలకనంద ఆసుపత్రిలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ వెనుక ఉన్న వైద్యుల ముఠా ఎవరనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జీవన్‌దాన్ కింద దాతల నుంచి సేకరించిన అవయవాలు లేదంటే రక్తసంబంధీకుల నుంచి సేకరించి మార్పిడి చేస్తున్నారు. కిడ్నీ రాకెట్‌లో డబ్బులు కోసం ఇలా కొందరు వైద్యులే అడ్డదారులు తొక్కడం విస్మయం కలిగిస్తోంది. నగరంలోని ఆసుపత్రులకు చెందిన వైద్యులు ఈ ముఠా వెనుక ఉన్నారా.. లేదంటే ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారా అనే కోణంలోనే విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే నలుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ప్రభుత్వం నియమించింది. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కిడ్నీ గ్రహీతలు, ఇద్దరు దాతలను బుధవారం కలిసి వివరాలు సేకరించారు. డాక్టర్ నాగేంద్ర బృందం డీఎంఈ వాణిని కలిసి ప్రాథమిక నివేదిక అందించారు.

**నిపుణులతోనే సాధ్యం..**

కిడ్నీ మార్పిడి చేయాలంటే ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ ఇతర వసతులు ఉండాలి. అనుభవం ఉన్న జనరల్ సర్జన్, నెఫ్రాలజిస్టులు, యురాలజిస్టులు, అనస్థీషియన్లు ఎంతో కీలకం. వారి ఆధ్వర్యంలోనే మార్పిడి సర్జరీలు జరుగుతుంటాయి. అలకనంద ఆసుపత్రిలో ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో లేనట్లు అధికారులు గుర్తించారు. కిడ్నీ మార్పిడి జరిగిన తర్వాత కొన్ని రోజులపాటు ఐసీయూలో దాతలను, గ్రహీతలను ఉంచుతారు. ఈ ఆసుపత్రిలో అసలు ఐసీయూనే లేదని తేలింది. దీంతో ఏదైనా పెద్దాసుపత్రిలో ఆపరేషన్లు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. ఆరు నెలల క్రితం అనుమతులు తీసుకున్న అలకనంద ఆసుపత్రిలో అసలు రోగుల రిజిస్టర్లే నిర్వహించడం లేదు. డాక్టర్లు ఎవరు.. ఎక్కడ నుంచి వస్తున్నారో వివరాలేవీ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**సుమోటోగా విచారణ**

ఈ వ్యవహారంపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సుమోటోగా విచారణ చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. అలకనంద ఆసుపత్రి వైద్యులపై కౌన్సిల్ ఛైర్మన్ డా.మహేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ వైస్‌ఛైర్మన్ డా.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ కుంభకోణంలో ప్రమేయమున్న వైద్యులపై ఎథికల్, మాల్‌ప్రాక్టీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే కౌన్సిల్ రిజిస్టర్ నుంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. కిడ్నీ దందాలోని ముఠా సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డా.దువ్వూరు ద్వారకనాథరెడ్డి, వి.అశోక్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# రైతు బంధు.. రాబందు



హైదరాబాద్: విల్లాలు.. వెంచర్లు.. ఫామ్‌హౌస్‌లు.. ఫంక్షన్ హాళ్లు... పెట్రోల్ పంపులు ఇవన్నీ వ్యవసాయేతర భూములు అనుకుంటున్నారా?.. కాదు.. ఇవన్నీ రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొన్నటి వరకూ రైతుబంధు పథకం కింద సాయం పొందిన వ్యవసాయ భూములు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు కొద్దిరోజుల క్రితం సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైన అంశాలివి. జిల్లా వ్యాప్తంగా 6.85లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు రైతుబంధు పథకం కింద ఏటా ఎకరాకు రూ.10వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే పథకం వర్తింపజేయాలని నిర్ణయం తీసుకోవడంతో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు కొద్దిరోజుల క్రితం సర్వే చేశారు. 52వేల ఎకరాల భూములు వ్యవసాయ యోగ్యం కాదని నిర్ధారించారు. ఇందులో ఖరీదైన విల్లాలు... వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చిన వ్యవసాయేతర భూములు ఉన్నాయని గుర్తించారు. ఇప్పటికే వీటికి ఏటా రూ.52కోట్ల చొప్పున ఆరేళ్లలో రూ.312 కోట్లు చెల్లించారు. ఇకపై పథకాన్ని వాటికి వర్తింప చేయకూడదని నిర్ణయించారు.

**ఫంక్షన్ హాళ్లు.. రిసార్టులు...**

రంగారెడ్డి జిల్లా పట్టణప్రాంత మండలాలైన శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట, మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధుల్లో రైతుబంధు పథకం కింద లబ్ధిపొందిన భూములు ఎక్కువగా ఉన్నాయి. ఆరేడేళ్ల క్రితమే వ్యవసాయేతర భూములుగా మారిపోయాయి. మొయినాబాద్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో పదేళ్ల నుంచి ఫామ్‌హౌసులున్నాయి. కొన్నింటిలో ఎలాంటి పంటలు పండించకున్నా వాటి యజమానులు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకుని ఏటా ఎకరాకు రూ.10వేల చొప్పున తీసుకుంటున్నారని అధికారులు తెలుసుకున్నారు. మరికొన్ని చోట్ల రిసార్టులకు, ఎనిమిది చోట్ల పెట్రోలు పంపులకు కూడా రైతుబంధు తీసుకుంటున్నారు.

**అనర్హులను తొలగించాలన్న లక్ష్యంతో...**

రైతు భరోసా పథకం అమలుపై కొద్దినెలల క్రితం ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించినప్పుడు రంగారెడ్డి జిల్లాలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న భూములకు ఈ పథకం ఇస్తున్నారంటూ తేలింది. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలోని 26మండలాల్లో వ్యవసాయ భూముల లెక్కలు తీయగా.. పది మండలాల్లో ఇలాంటివి ఎక్కువగా ఉన్నాయని సర్వేలో గుర్తించారు. 90శాతానికిపైగా రైతు భరోసా పథకానికి అనర్హులని తేల్చారు. 'అనర్హులను తొలగించేందుకు గ్రామసభల్లో జాబితాలు ఉంచామని, గ్రామసభలు పూర్తయ్యాక అనర్హుల పేర్లు తొలగించనున్నామని రెవెన్యూశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# గనుల రాబడి.. తడబడి!



తాండూరు: రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో విధించిన ఆర్థిక లక్ష్యాన్ని జిల్లా గనుల శాఖ చేరుకోలేక పోయింది.. ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు వివిధ రకాల ఖనిజాల నుంచి రాయల్టీ రూపంలో రూ.103.10 కోట్లను ఆర్జించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో కేవలం రూ.82.47 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. మొత్తం లక్ష్యంలో మిగిలిన 20.63 కోట్ల ఆదాయం రాకుండా పోయింది. ప్రస్తుత జనవరి నుంచి మార్చి చివరి వరకు ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు సమయం ఉంది. ఇప్పటికే జనవరిలో 22 రోజులు గడిచి పోయాయి. మిగిలింది కేవలం 68 రోజులు మాత్రమే. ఈ నేపథ్యంలో తొమ్మిది నెలల ఆర్థిక లక్ష్యంలో మిగిలిన ఆదాయంతో పాటు ప్రస్తుతం మూడు నెలలకు విధించిన ఆర్థిక లక్ష్యం సమకూరుతుందా లేదా అనేది సందేహంగానే మారింది.

**గతేడాది అంతకు మించిన ఆదాయం**

జిల్లా గనుల శాఖకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించిన ఆదాయం సమకూరింది. లీజులు పొంది 229 గనుల నుంచి ప్రభుత్వం రూ.113.46 కోట్లు సాధించాలని లక్ష్యాన్ని విధించగా మొత్తం రూ.121.01 కోట్లు వచ్చింది.

**అక్రమార్కుల చర్యలతో ఆదాయానికి గండి**

జిల్లాలో జోరుగా సాగుతున్న అక్రమ ఖనిజాల రవాణాతో పాటు తవ్వకాలను నిరోధించాలి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. ఖనిజాలు అక్రమమా? సక్రమమా అనేది తేల్చాలి. అక్రమమని తేలితే పదింతల జరిమానాలు విధించే అధికారం ఉంది. కానీ ఆ సాహసం చేయడం లేదు. దీంతో ఖనిజాల అక్రమ తవ్వకాలకు తోడు రవాణా భారీగా సాగి పోతోంది. రాయల్టీ రూపంలో సమకూరాల్సిన నిధి రాకుండా పోతోంది.

కొంత మంది తాము లీజు పొందిన భూముల్లో ఖనిజాల వెలికితీత ఏడాది, రెండేళ్ల కిందటే పూర్తయ్యాయి. లీజు పరిమితి మాత్రం ఉంది. ఇలాంటి వారు ఇతర భూముల్లో అక్రమంగా ఖనిజాలను వెలికి తీసి ఆర్థికంగా లాభ పడుతున్నారు. ప్రభుత్వానికి మాత్రం ఆదాయం రావడం లేదు.

ఖనిజాలను వెలికి తీయని వారికి తాఖీదులు పంపిస్తున్నాం- సత్యనారాయణ, గనుల శాఖ సహాయ సంచాలకులు, తాండూరు.

జిల్లాలో లీజులు పొంది ఖనిజాలను వెలికి తీయని గనుల యజమానులకు తాఖీదులు పంపిస్తున్నాం. కొన్ని లీజులు పొందిన గనుల్లో ఇప్పటి వరకు ఖనిజాలనే వెలికి తీయలేదు. వీరికి కూడా తాఖీదులు పంపించాం.

# నిర్లక్ష్యానికి 14 ఏళ్లు

ముస్తాబాద్ : మండల కేంద్రంలో కూరగాయల క్రయ, విక్రయదారుల కోసం రూ.లక్షలు వెచ్చించి షెడ్లు నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా నేటికీ వాటిని వినియోగంలోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవు. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపులా అమ్మకాలు చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరోవైపు క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు.ముస్తాబాద్ మండల కేంద్రంలో పోత్గల్ వెళ్లే రోడ్డులో శివాలయం పక్కనే 2011 సంవత్సరంలో కూరగాయలు, చేపల క్రయ, విక్రయాల కోసం షెడ్లు నిర్మించారు. బీఆర్‌జీఎఫ్‌తోపాటు ఇతర నిధులు దాదాపు రూ. 5 లక్షలు వెచ్చించి కూరగాయల మార్కెట్ షెడ్డు, రూ. 8 లక్షలతో చేపల మార్కెట్ షెడ్డు నిర్మించారు. పూర్తి చేసి దాదాపు 14 సంవత్సరాలు అవుతున్నా విక్రయాలు చేస్తున్న దాఖలాలు లేవు.షెడ్ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు.శివాలయం సమీపంలోనే కూరగాయల విక్రయదారులు తాత్కాలికంగా కట్టెలతో షెడ్ల మాదిరిగా



వేసుకొని కూరగాయల విక్రయాలు జరుపుతున్నారు. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ఏళ్ల తరబడి కాలం వెల్లదీస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు అలంకారప్రాయంగా ఉండిపోయాయి. మార్కెట్‌లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక నానా తంటాలు పడుతున్నారు.కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారికి ఓవైపు మాంసం అమ్మకాలు, మరోవైపు చికెన్ విక్రయాలు చేపడుతున్నారు. పరిసరాల్లో పడేసే వ్యర్థాల కోసం శునకాలు అక్కడే మకాం వేస్తున్నాయి. ప్రధాన రోడ్డుపై స్వైరవిహారం చేస్తూ వాహనదారులు, పాదచారులపై దాడి చేస్తున్నాయి. నాయకులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కనీస సౌకర్యాలు కల్పించి షెడ్లలో విక్రయాలు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

**వినియోగంలోకి తీసుకురావాలి**

మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి కూరగాయలు, చేపల షెడ్లు నిర్మించి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నాయకులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి వినియోగంలోకి తీసుకురావాలి. గూడూరి భరత్, స్థానికుడు

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

నిరుపయోగంగా ఉన్న షెడ్లకు సంబంధించిన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటిలో చేపలు, కూరగాయలు విక్రయించేలా చొరవ చూపుతాం. ఉన్నతాధికారుల చొరవతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. క్రయ, విక్రయదారులకు కనీస సౌకర్యాలు కల్పించేలా దృష్టి సారిస్తాం.రమేశ్, ఈవో, ముస్తాబాద్

# ఆకర్షణీయం.. ఆహ్లాదకరం

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన పలు ప్రాజెక్టులను ప్రారంభించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులపాటు ప్రారంభోత్సవాల జాతర కొనసాగనుంది. ఈ నెల 23న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సమీకృత మార్కెట్, రాజీవ్‌పార్కు, విద్యానగర్, ప్రభుత్వాసుపత్రి వెనుకాల నిర్మించిన వీధివ్యాపారుల దుకాణాలను ప్రారంభిస్తారు. 24న కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తోపాటు రాష్ట్ర మంత్రులతో అంబేద్కర్ స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ పార్కు, 24 గంటల తాగునీరు, కుమార్‌వాడీ స్కూల్‌లో ఈ క్లాస్ ఆధునికీకరణ పనులు ప్రారంభించనున్నారు. సుమారు రూ.80 కోట్ల పనులు ప్రజలకు అందుబాటులో రానున్నాయి.నిరంతర తాగునీరుహౌసింగ్‌బోర్డు కాలనీలో 24 గంటల తాగునీటి సరఫరా చేసేందుకు పనులు పూర్తి చేశారు. మొత్తం 4,055 ఇళ్లకు నల్లా కనెక్షన్ల సరఫరా చేయాల్సి ఉండగా ముందుగా 2,200 ఇళ్లకు నల్లా విప్పితే చాలు శుద్ధి నీరు రానుంది. ఇప్పటికే దీని పరిధిలోని ఐదు డివిజన్లకు మీటర్లు బిగించారు. రాష్ట్రంలోనే నిరంతర నీటి సరఫరా చేసే నగరంగా కరీంనగర్ నిలువనుంది.

రూ.14 కోట్లతో మల్టీపర్పస్ పార్కు

నగర నడిబొడ్డున ఉన్న మల్టీపర్పస్ పార్కు అందుబాటులోకి రానుంది. సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావరణం, మ్యూజికల్ వాటర్ ఫౌంటెయిన్, ఫుడ్ కోర్టు, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, గార్డెన్ వంటివి ఉన్నాయి. దీనికి నిర్వహణ కోసం టెండర్ కూడా



నిర్వహించారు. నుంచి ప్రజలు సందర్శించే అవకాశముంది.

స్పోర్ట్స్ కాంప్లెక్స్

అంబేద్కర్ స్టేడియం ముఖ ద్వారంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. భగత్‌నగర్, కట్టరాంపూర్, గణేశ్‌నగర్ ప్రాంతాల రహదారి వైపు వాణిజ్య సముదాయం నిర్మించారు. ఇందులో 700 మంది సామర్థ్యంతో బంకెట్ హాల్, క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఆరు డార్మెట్రిస్ గదులు, బాత్‌రూమ్‌లు ఉంటాయి. 22 షెట్టర్లు, 22 ఏసీ గదులు, బాత్‌రూమ్‌లు, సెల్లార్ పార్కింగ్ వసతి కల్పించారు.

పద్మనగర్ సమీకృత మార్కెట్

పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో అన్ని హంగులతో దుకాణాలు, స్టాల్స్ నిర్మించారు. కూరగాయలు, మాంసం, చికెన్, చేపలు, కిరాణ సామగ్రి ఒకే చోట దొరికేలా తీర్చిదిద్దారు. ఇందులో విక్రయించుకునే వారిని ఇప్పటికే ఎంపిక చేశారు. నగరవాసులకు మరో పెద్ద మార్కెట్ అందుబాటులోకి రానుంది.

# వనంపై గొడ్డలివేటు

మల్యాల : దాదాపు 30 ఏళ్ల నుంచి గ్రామస్థులు కంటికి రెప్పలా కాపాడుకున్న టేకువనంపై కలపదొంగల కన్నుపడింది. అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన టేకువనం స్మగ్లర్ల గొడ్డలిదెబ్బలకు మోడు వారుతోంది. సంరక్షించాల్సిన అటవీ అధికారులు పర్యవేక్షణలోపంతో విలువైన వన సంపద తరలిపోతోంది.

మల్యాల మండలంలోని మారుమూల గ్రామమైన ఓబులాపూర్ ప్రజలు భవిష్యత్తు తరాల కోసం అటవీ సంపదను కాపాడుకోవాలన్న సంకల్పంతో వీఎస్‌ఎస్(వన సంరక్షణ సమితి) ఏర్పాటు చేసుకొన్నారు. 840 హెక్టార్ల విస్తీర్ణంలోని టేకువనానికి కాపలాదారులుగా నిలవడంతో నేడు టేకు చెట్లు వృక్షాలుగా మారాయి. 2014 నుంచి గత ప్రభుత్వం వీఎస్‌ఎస్‌లను రద్దు చేయడంతో అటవీ సంరక్షణలో గ్రామస్థుల భాగస్వామ్యం లేకుండా పోయింది. అటవీ అధికారులే టేకు వనాన్ని రక్షిస్తున్నారు. గతంలో అటవీ ప్రాంతం నుంచి ఒక్క చెట్టు కొమ్మను నరికివేయాలన్నా వీఎస్ఎస్ అనుమతి తప్పనిసరి. కలపదొంగలు పట్టుబడితే భారీ జరిమానాలు ఉండేవి. వీఎస్ఎస్ ఛైర్మన్‌తోపాటు సభ్యుల నిఘా ఉండేది. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా టేకువనం దొంగలపాలవుతోందన్న ఆరోపణలున్నాయి. నిత్యం పెద్దపెద్ద టేకు చెట్లను నరికివేస్తూ యథేచ్ఛగా తరలిస్తుండటంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓబులాపూర్‌కు సమీపంలోని కొన్ని గ్రామాలకు చెందిన వ్యక్తులు రాత్రివేళల్లో భారీసైజు టేకు చెట్లను



నరికి తరలిస్తుండటంతో అటవీ ప్రాంతంలో మోడుబారిన మొదళ్లు దర్శనమిస్తున్నాయి. ఓబులాపూర్, గొర్రెగుండం అటవీ ప్రాంతంలో తరచూ వన్యప్రాణుల వధ జరుగుతోందని కొందరు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఓబులాపూర్ వీఎస్ఎస్ పనితీరుపై అప్పటి ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ వీఎస్ఎస్‌గా ప్రకటించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నాటి వీఎస్ఎస్ ఛైర్మన్ వెంకటి కృషిని గుర్తించిన అధికారులు గోవాలో జరిగిన 'సార్క్' దేశాల సమావేశంలో మాట్లాడే అవకాశం కల్పించారు. వీఎస్ఎస్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాలతోపాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులు కూడా చేపట్టారు. బీట్ అధికారి స్థానికంగా ఉండటానికి క్వార్టరు భవనం నిర్మించారు. ఇప్పుడవన్నీ గ్రామస్థులకు గత స్మృతులుగా మారాయి.

**రిజర్వ్ అటవీ ప్రాంతంలో హద్దురాళ్లు**

ఓబులాపూర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు పట్టాభూములున్నాయని హద్దురాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో పలుమార్లు అటవీ అధికారులు హద్దురాళ్లను తొలగించి ఎలాంటి పట్టా భూములులేవని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అటవీ ప్రాంతంలో పట్టాభూమి ఉందని కొందరు కొన్ని చోట్ల హద్దురాళ్లు ఏర్పాటు చేసుకున్నారు.

**కేసులు నమోదు చేస్తున్నాం**

ఓబులాపూర్, గొర్రెగుండం గ్రామాల పరిధిలోని టేకువనం నుంచి అక్రమంగా కలపను తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఓబులాపూర్‌లోని క్వార్టరు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం రామన్నపేటలో ఉంటున్నాం. ఓబులాపూర్ సమీపంలోని ఒకట్రెండు గ్రామాలకు చెందిన కలప దొంగలు టేకు చెట్లు నరికితరలిస్తుండగా పట్టుకొని కేసులు కూడా నమోదు చేశాం. వన్యప్రాణుల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.వసీం, ఓబులాపూర్, గొర్రెగుండ అటవీ బీట్ అధికారి

# తెగ దండుకుంటున్నారు..!

సత్తుపల్లి : అసైన్డ్ భూముల్లోని ఇళ్లకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ల పేరిట కొందరు దళారులు భారీ వసూళ్లకు తెగబడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను అడ్డుపెట్టుకుని ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్నారు. సాధారణంగా అసైన్డ్ భూముల్లోని ఇళ్ల విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.లక్షకు 2.50 శాతం ప్రభుత్వానికి చలానా చెల్లించి సదరు దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలి. కొందరు మధ్యవర్తులు అక్రమాలకు తెరలేపి ఒక్కో ఇంటి రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష నుంచి రూ.1.20లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల సత్తుపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 300కుపైగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు జరగ్గా.. సుమారు రూ.2.50కోట్ల వరకు చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు రూ.10లక్షల విలువైన ఇంటికి చలానా, డాక్యుమెంట్ ఛార్జీలు కలుపుకొని రూ.30వేలు ఖర్చవ్వాల్సి ఉండగా.. దళారులు పేదల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారు.

**అధికారుల అండతోనే..!**అధికారుల అండతోనే దళారులు రిజిస్ట్రేషన్ల పేరిట వసూళ్ల పర్వం జోరుగా సాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ దస్త్రానికి కార్యాలయ స్థాయి అధికారికి రూ.15వేలు, సిబ్బందికి రూ.2,500 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ స్థలాల్లోని ఇళ్లకు ఎలాంటి ఆదరవు లేకపోవటంతో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే బ్యాంకు రుణాలు వస్తాయని పేదలు భావిస్తున్నారు. దీన్ని అడ్డుపెట్టుకుని మధ్యవర్తులు, కొందరు దస్తావేజులేఖరులు దందాలకు పాల్పడుతున్నారు. సత్తుపల్లి ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ ద్వారా విషయం తెలుసుకొని ఇప్పటివరకు చేసిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్నామని రిజిస్ట్రార్ రవీందర్ తెలిపారు.

# ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా!

హుజూరాబాద్ : హుజూరాబాద్ నుంచి పరకాల, జమ్మికుంట, కరీంనగర్ ఇలా ఎటు ప్రయాణం చేసినా అన్ని ప్రధాన రహదారుల వెంట రోడ్డు పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయబావులు కనిపిస్తున్నాయి. గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. రాత్రి వేళల్లో ఎక్కువ జరుగుతుండగా.. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకున్న దాఖలాలులేవు.

**కానరాని హెచ్చరిక సూచికలు**ఇలాంటి ప్రమాదకర బావుల వద్ద సమీపంలో హెచ్చరిక సూచికలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. గతంలో మాందాడిపల్లిలోని వ్యవసాయబావిలో ఓ వాహనం అందులో పడగా.. డ్రైవర్, క్లీనర్‌కు ప్రాణాప్రాయం తప్పింది. మరోవైపు పెద్దపాపయ్యపల్లి సమీపంలో హుజూరాబాద్ వైపు ధాన్యంతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బావిలో పడింది. ఇలా కొన్ని ప్రమాదాలు జరిగినా.. అధికారుల్లో చలనంలేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

**జాగ్రత్త చర్యలు చేపడుతాం**

జమ్మికుంట, కరీంనగర్, హుజూరాబాద్ ప్రధాన రహదారుల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే ఉన్న బావులను పరిశీలిస్తాం. అందుకు తీసుకుబోయే చర్యలకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాం. త్వరలోనే తగిన జాగ్రత్త చర్యలు చేపడతాం.మహేందర్, హుజూరాబాద్ ఆర్‌అండ్‌బీ అధికారి

# మహా ప్రణాళిక



హైదరాబాద్ : వచ్చే 25ఏళ్ల మహానగర అవసరాలను దృష్టిలో ఉంచుకొని బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)-2050కు హెచ్ఎండీఏ ముమ్మర కసరత్తు చేస్తోంది. 3-4 నెలల్లో ముసాయిదా విడుదలకు సన్నాహాలు చేస్తోంది. అనంతరం ఆయా జిల్లాల, మండల స్థాయుల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ దాదాపు మూడు నెలల పాటు జరిగే అవకాశం ఉంది. ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు, చేర్పుల అనంతరం పూర్తి మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఈ ఏడాది చివర నుంచి కొత్త మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందని హెచ్ఎండీఏ అధికారి తెలిపారు.

**ప్రస్తుతం ఇలా..**

ప్రస్తుతం మహానగరంలో ఐదు మాస్టర్‌ప్లాన్‌లు అమల్లో ఉన్నాయి. పాత బల్దియా, జీహెచ్ఎంసీ, ఎయిర్‌పోర్టు అథారిటీ, సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ, విస్తరిత ప్రాంతాల అభివృద్ధి ప్లాన్-2030 ఉన్నాయి. కొన్నిసార్లు ఒక ప్రాంతం రెండు మాస్టర్ ప్లాన్‌ల పరిధిలోకి వస్తుండడంతో రకరకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 2030 మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల కారణంగా చాలా ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి సాగడం లేదు. ఎన్‌వోసీల కోసం వివిధ ప్రభుత్వ శాఖల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎన్‌జీఆర్ఐ, నేషనల్ రిమోట్ సెన్సింగ్, గూగుల్ మ్యాపులు, స్థానిక రెవెన్యూ మ్యాపులు, గ్రామాల మ్యాపులను తీసుకొని.. కొత్త సాంకేతిక విధానంతో తప్పులకు ఆస్కారం లేకుండా రూపొందించడానికి కసరత్తు చేస్తున్నారు. ఇక నుంచి ఒకటే మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థలు, ఇతర అథారిటీలు తమ ప్రణాళికలు రూపకల్పన చేయనున్నాయి.

**పెరగనున్న జోన్లు..**

విస్తరిత ప్రాంతంలో 2050 వరకు ఎలాంటి సౌకర్యాలు ఉండాలి.. రహదారుల అనుసంధానం నుంచి రెసిడెన్షియల్ జోన్లు, పారిశ్రామిక జోన్లు, అర్బన్ నోడ్లు, గ్రిడ్ రోడ్లు, గ్రీన్ జోన్లు.. ఎక్కడెక్కడ ఎంతెంత ఉండాలి.. పొందుపర్చనున్నారు.

ఏడు జిల్లాల పరిధిలో మహానగర విస్తరిత ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని 2030 అవసరాల కోసం 2008లో మాస్టర్‌ప్లాన్‌ను హెచ్ఎండీఏ రూపకల్పన చేసింది. అప్పట్లో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోలేదు. అదే ఇప్పుడు మహానగర అభివృద్ధికి ఆటంకంగా మారుతోందనే విమర్శలున్నాయి.

అన్ని రకాల జోన్లు పెంచనున్నారు. స్థానిక జోన్ కార్యాలయాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఆరు జోన్లను పదికిపైగా పెంచడంతోపాటు అదనపు సిబ్బందిని నియమించే అవకాశం ఉందంటున్నారు.

**ఆర్‌ఆర్‌ఆర్ దాటి పరిధి..**

హైదరాబాద్ మహానగర ప్రణాళిక-2030లో ఏడు జిల్లాల పరిధి మాత్రమే ఉంది. కొత్త ప్రణాళికలో ప్రాంతీయ రింగు రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) దాటి విస్తరించనున్నారు.

ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్ల కంటే విస్తీర్ణం పెరగనుంది. కొత్తగా 4 జిల్లాలు, 32 మండలాలు హెచ్ఎండీఏలో చేరనున్నాయని చెబుతున్నారు. దాదాపు 13వేల చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేటతోపాటు కొత్తగా నల్గొండ, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పలు మండలాలను చేర్చనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 74 మండలాలుండగా.. వాటి సంఖ్య వంద దాటనుందని ఓ అధికారి తెలిపారు.

**ఆ మూడే కీలకం..**

కొత్త మాస్టర్‌ప్లాన్‌లో మూడు అంశాల(ప్రజారవాణా, నీటివనరులు, పెట్టుబడులకు అనుగుణంగా ప్రత్యేకంగా జోన్లు)కు ప్రాధాన్యం కల్పించనున్నారు.

ఓఆర్ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య రేడియల్, గ్రిడ్ రోడ్లు, అంతర్గత రహదారుల అభివృద్ధి, మెట్రో సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

జాతీయ రహదారులు, విమానాశ్రయంతో అనుసంధానం.. జనాభాకు అనుగుణంగా ప్రజారవాణాను పటిష్ఠం చేసేందుకు మొబిలిటీ ప్లాన్‌లో వివిధ సూచనలు చేయనున్నారు.

పారిశ్రామిక కారిడార్లు, కొత్త పరిశ్రమల స్థాపన, వర్క్ ఫోర్సుకు కావాల్సిన మౌలిక వసతులు ఇలా ఆర్థికంగా పురోగతి సాధించడానికి కావాల్సిన అన్ని అంశాలను ఇందులో చర్చించనున్నారు.

ఇప్పటి నుంచి వచ్చే 25ఏళ్లకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో 3600 చెరువులున్నాయి. ఇవి ఆక్రమణలకు గురికాకుండా బ్లూ అండ్ గ్రీన్ పేరుతో ప్రత్యేక ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది.

# కొనుగోళ్లలో స్ఫూర్తి.. రూ.అరకోటితో దీప్తి



తాండూరు : జిల్లాలోని మహిళలు ఇంటిని చక్కదిద్దడమే కాకుండా వ్యాపారంలోనూ తమకు సాటిలేదని నిరూపిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్లు, అల్లికలు, కిరాణ దుకాణాల నిర్వహణ వంటి చిన్నచిన్న పనులకే పరిమితం కావడంలేదు. రైతన్నలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అదనపు ఆదాయాన్ని సంపాదించి తోటి మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాపారం చేయడంతోపాటు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. రైతన్నలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ధాన్యం సేకరించి మిల్లర్లకు పంపిణీ చేసి తమ సత్తాను చాటుతున్నారు.కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

**కమీషన్ రూ.32నుంచి రూ.50కి పెంచాలి**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే కమీషనును పెంచాలని మహిళా సంఘం ప్రతినిధులు కోరుతున్నారు. ప్రస్తుతం క్వింటాలుకు రూ.32 మాత్రమే ఇస్తున్నారని, రూ.50కి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. బషీరాబాద్ మండలంలోని కాశింపూరు కొనుగోలు కేంద్రంలో 9,534 క్వింటాళ్ల ధాన్యం కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని లెక్కలు పూర్తి చేసిన తరువాత సంఘాలకు కమీషన్ నగదును అందించనున్నారు.

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాలేదు**

జిల్లా వ్యాప్తంగా ఈఏడాది వానాకాలం సీజనులో రైతులకు మద్దతు ధర, సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ నగదును అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 34 కేంద్రాల ద్వారా మహిళలు మొత్తం 1,68,959 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇతర కొనుగోలు కేంద్రాల్లో తూకంలో తేడాలు, ధాన్యంలో తేమ వంటి ఇబ్బందులు ఎదురైనా మహిళా సంఘాల్లో మాత్రం రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేకుండా సాఫీగా వ్యాపారాన్ని కొనసాగించారు. వచ్చే ఏడాది కేంద్రాల సంఖ్యను పెంచి ఇంకా ఎక్కువ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెబుతున్నారు.

**వచ్చే సీజన్‌లో మరిన్ని కేంద్రాలను అప్పగించండి- మంగమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు, బషీరాబాద్.**

ధాన్యం కొనుగోళ్లతో ఈసారి కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించాం. వచ్చే సీజనులో మరిన్ని కేంద్రాలను మాకు అప్పగించాలని కోరుతున్నాం. క్వింటాలుకు రూ.32 మాత్రమే ఇస్తున్నారు. కనీసం రూ.50 చెల్లిస్తేనే బాగుంటుంది. రైతులకు ఇబ్బందుల్లేకుండా క్రమపద్ధతిలో కొనుగోళ్లు చేశాం. కేంద్రాల ఏర్పాటుతో సంఘానికి అదనపు ఆదాయం సమకూరుతోంది.

మహిళా సంఘాలకు అప్పగించిన కేంద్రాలు.. 34
కొనుగోలు చేసిన ధాన్యం...1,68,959 క్వింటాళ్లు
వీటిలో దొడ్డు రకం.. 1,43,920
సన్నరకం.. 25,039
అందనున్న కమీషన్... రూ.54,06,688

# బీమా.. లేదు ధీమా!

హైదరాబాద్: వాహనాలకు నకిలీ బీమా పత్రాల తయారీనుంచి బీమా సొమ్మును పొందేందుకు నకిలీ పత్రాల సృష్టి గ్రేటర్‌వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. కొన్నేళ్లుగా ఈ తంతు నిరాటంకంగా సాగుతున్నా సరైన పర్యవేక్షణ ఉండటంలేదు. తాజాగా శంషాబాద్‌లో 13మందిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో మరోసారి బయట పడింది.

**ఆర్టీఏ కార్యాలయాలు అడ్డాగా..**

ఆర్టీఏ కార్యాలయాలు అడ్డాగా ఈ దందా సాగుతోంది. ముఖ్యంగా రవాణా వాహనాలకు సంబంధించి బీమా ఉత్తుత్తి తంతుగా మారుతోంది. గతంలో అత్తాపూర్, సికింద్రాబాద్ ఇతర ఆర్టీఏ కార్యాలయాల వద్ద ట్రాన్స్‌పోర్టు పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి కొందరు దళారులను అదుపులోకి తీసుకున్నారు.

**సిబ్బంది చేతివాటం:** ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి. వాహనం పాడైనా.. దొంగతనానికి గురైనా బీమా ఉంటే తిరిగి పొందే వీలుంది. ఆటోలు, బస్సులు, స్కూళ్ల వాహనాలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సు తీసుకోవాలి. ప్రమాదం జరిగి తీవ్ర గాయాలు, మృత్యువాత పడిన సందర్భాల్లో ఈ బీమా రక్షణగా నిలుస్తుంది. వాహనానికి థర్డ్ పార్టీ బీమా లేకపోతే.. ఆ భారం వాహన యజమాని భరించాల్సి ఉంటుంది. వాహనాలు ఫిట్‌నెస్‌కు వచ్చిన సందర్భాల్లో బీమాను పరిశీలించాలి. కొందరు నకిలీ బీమా పత్రాలను అందిస్తున్నారు. మరికొందరు నెల కోసం బీమా తీసుకుంటున్నారు. చాలా కంపెనీలు ఏడాది కాలానికి బీమా ఇస్తుంటాయి. దీన్ని కనీసం పరిశీలించకుండానే సిబ్బంది ఫిట్‌నెస్ ఇస్తున్నారు. ఫిట్‌నెస్‌తోపాటు ఈ నకిలీ బీమాపత్రాల నమోదుకు కొందరు సిబ్బంది రూ.2-3వేల వరకు




వసూలుచేస్తున్నారు. ఇక బీమా పాలసీ మొత్తాలను పొందేందుకు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక బీమా కంపెనీలు వాహన బీమా పాలసీలను విక్రయిస్తున్నాయి. ఇవి ఇన్సూరెన్సు రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఐఆర్‌డీఏ) పరిధిలో పనిచేస్తుంటాయి. రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఐఆర్‌డీఏతో సరైన అనుసంధానం లేక నకిలీ పత్రాలను గుర్తించలేకపోతున్నారు.

# ఆడిట్ అభ్యంతరాల సంగతి అంతేనా?

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లా పరిషత్తులలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కల తీరు తెన్నులను ఆడిట్ అధికారులు కొన్ని నెలల కిందట పరిశీలించారు. రికార్డుల తనిఖీల్లో కీలకమైన నిధుల వినియోగానికి సంబంధించిన తప్పిదాలను గుర్తించారు. ఇలా 64 అభియోగాలతో కూడిన వాటి విషయంలో ఇప్పటికీ ఎలాంటి చర్యలు కనబడటం లేదు. ఇందులో అత్యధికంగా నిబంధనల్ని అతిక్రమించినవే 24 ఉన్నాయి. చేసిన ఖర్చుల్లో వ్యత్యాసమున్నవి 3 ఉండగా.. సరైన రికార్డులు లేనివి 12 ఉండటం గమనార్హం. లక్షలాది రూపాయల ప్రజాధనం వినియోగంలో ఇష్టానుసారంగా వ్యవహరించిన వారిపై ఇప్పటి వరకు చర్యలు



తీసుకున్న దాఖలాలు లేవు.

ఉమ్మడి జిల్లాలోని 58 మండల పరిషత్తు లెక్కల్లోనూ చిక్కులను గమనించారు. 957 అభ్యంతరాలకు గల కారణాలని అడిగారు. చేసిన ఖర్చు, పెట్టిన బిల్లుల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించిన తీరును గుర్తించారు. బీర్పూర్ మండలంలో అత్యధికంగా 33, ఇబ్రహీంపట్నం మండల పరిషత్తులో 30.. ఇలా దాదాపుగా ప్రతి మండలంలో సగటున 16 అంశాల్లో లొసుగులు కనిపెట్టారు. వీటిపై సంజాయిషీని అడిగారు. ఇదే విధంగా గ్రామ పంచాయతీల్లో చేసిన ఖర్చుల్లో డొల్లతనాన్ని వెలికితీశారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 966 గ్రామ పంచాయతీల్లో 17,161 అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సగటున ఒక్క పంచాయతీలో 18 తప్పులు దొరికాయి.

**పంచాయతీల్లో అధికంగా..**

మొత్తం 1,215 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇప్పటి వరకు 966 పంచాయతీల్లో ఆడిట్ అధికారులు పరిశీలనలు జరిపారు. కరీంనగర్ జిల్లాలో 62, జగిత్యాల జిల్లాలో 95, పెద్దపల్లి జిల్లాలో 5, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 84 గ్రామ పంచాయతీల్లో ఇంకా రికార్డుల పరిశీలన జరగాలి. ఇప్పటి వరకు గుర్తించిన వాటి పరంగా అక్రమాలకు పాల్పడినవారి విషయంలో ఎలాంటి చర్యలు కనిపించలేదు. ప్రతి ఏటా అధికారులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు సంబంధిత శాఖ అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. దొరకబట్టిన తప్పుల ఆధారంగా మరోసారి అలాంటిది జరగకుండా చూడాలి. కానీ ప్రతి ఆర్థిక సంవత్సరంలో వీటి విషయంలో మొక్కుబడి తీరే కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు వీటి విషయంలో తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

**గుర్తింపుతోనే సరి..**

ప్రజాధనం వినియోగం విషయంలో పారదర్శకత కొరవడుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో కీలకమైన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు సంబంధించిన నిధుల ఖర్చు విషయంలో అడ్డగోలు తీరు కనిపిస్తోంది. ఇప్పటికే ప్రజావాణిల్లో ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచులపై నిధుల దుర్వినియోగమనే అభియోగాలతో ఫిర్యాదులందుతున్నాయి. ఇది నిజమేననే విధంగా ఆడిట్ అధికారులకు క్షేత్రస్థాయిలో రికార్డుల పరిశీలన సమయంలో చాలా అభ్యంతరాలు వారికి తారసపడుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సర రికార్డులను పరిశీలిస్తే చేయని పనులకు బిల్లులు పెట్టడం నిబంధనల్ని ఉల్లంఘించి సొమ్మును పక్కదారి పట్టించడంలాంటి దుశ్చర్యలు ఆడిట్‌లో బహిర్గతమయ్యాయి. గతేడాది మే నుంచి జులై వరకు మండల పరిషత్తు, జడ్పీల దస్త్రాలను పరిశీలించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు పెట్టిన తీరుపై లెక్కాపత్రాలు తనిఖీ చేపట్టారు. వెయ్యికిపైగా అభ్యంతరాలు ఎంపీపీ, జడ్పీ కేటగిరీల్లో వెలుగులోకి వచ్చినా ఇప్పటి వరకు వాటికి సంబంధించి సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తప్పులు చేసిన వారిపట్ల ఇంకా ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నారు.

# సాగుకు యోగ్యంగా లేని భూములు.. 2,800 ఎకరాలు!

కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అర్హులైన అన్నదాతలకు 'రైతు భరోసా' పథకం కింద పెట్టుబడి సాయాన్ని మంజూరు చేయనున్న విషయం తెలిసిందే. ఏడాదికి రెండు సీజన్లకు, సాగు చేసే భూములకు ఎకరాకు రూ.6వేల చొప్పున ఇస్తామని ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిజ లబ్ధిదారుల గుర్తింపునకు 18 నుంచి 21 వరకు సర్వే పూర్తిచేసిన ప్రత్యేక బృందాలు.. మంగళవారం నుంచి ప్రారంభమైన గ్రామసభల్లో అభ్యంతరాలను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ గురువారంతో ముగియనున్నట్లు అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23



మండలాల్లోని సాగు భూముల విస్తీర్ణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కతేల్చారు. నివేదిక జిల్లా అధికారి కార్యాలయానికి అందింది.

వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని మండలాల్లో ఏఓలు, ఏఈఓలు, రెవెన్యూశాఖ సిబ్బంది గ్రామాల్లోని రెవెన్యూ నంబర్ల వారీగా సర్వే పూర్తిచేశారు. వ్యవసాయానికి పనికిరాని, సాగు చేపట్టని భూముల వివరాలను నమోదు చేశారు. ఈ భూములు జిల్లా వ్యాప్తంగా 2,800 ఎకరాల్లో ఉన్నట్లు నివేదిక రూపొందించారు. దీన్నిబట్టి చూస్తే, గతంలో 'రైతుబంధు' పథకం లబ్ధిదారులతో పోల్చిచూస్తే పెద్దగా మార్పుల్లేవని అధికారుల పరిశీలనలో తేలింది. గతేడాది చివరి సీజన్ లెక్కల ప్రకారం పట్టాదారులు, అసైన్డ్ పట్టాదారులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలున్న 3.49 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బాబురావు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా సర్వేలో సాగుకు యోగ్యంగా లేని 2,800 ఎకరాల భూమిని గుర్తించినట్లు చెప్పారు. మండల అధికారుల నుంచి తాజాగా అందిన నివేదికల ఆధారంగా ఈ మేరకు ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. గ్రామసభలు ఒకట్రెండు రోజుల్లో ముగుస్తాయి. ఇంకా ఏమైనా అభ్యంతరాలున్నా, సాగు చేయని భూములు తేలినా పరిశీలించి తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

## సొంత వైద్యం శ్రేయస్కరం కాదు

నల్గొండ : వైద్యుల సూచన లేకుండా సొంతంగా మాత్రలు వాడటం.. సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడటం శ్రేయస్కరం కాదని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ పీజీ, డిగ్రీ కళాశాలలో బాధ్యుడు రమాకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు చక్కటి స్పందన లభించింది. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.మాతృనాయక్, గుండె వైద్య నిపుణులు డా.నరహరి, కంటి వైద్య నిపుణులు డా.ఏసీహెచ్ పుల్లారావు, స్త్రీ వైద్యనిపుణులు డా.వసంత కుమారి తదితరులు ఆరోగ్య సమస్యలతో పాటు జిల్లాలో లింగ నిష్పత్తి, శిశు విక్రయాలపై అవగాహన కల్పించారు. కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పట్టణంలోని పలు కాలనీల వాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు పలువురికి పలు రకాల పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు.

ఆరు నెలలకోసారి కంటి పరీక్షలు అవసరం
డా.ఏసీహెచ్.పుల్లారావు, కంటివైద్య నిపుణులు

ప్రతి ఆరు నెలలకు ఓసారి తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. 'ఏ' విటమిన్ లోపం కారణంగా దృష్టి లోపం వస్తుంది. దూర దృష్టి, దగ్గర దృష్టి లోపాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. వయసు రీత్యా వచ్చే శుక్లాలను ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. చరవాణి ఎక్కువగా చూడడం మూలంగా కంటి చూపు మందగించే అవకాశాలున్నాయి. ఆకుకూరలతో పాటు నిత్యం గుడ్డు, పాలు, పండ్లు వంటి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఒకరు ఇచ్చే నేత్రదానం మూలంగా ముగ్గురికి కంటి చూపు వస్తుంది. యువత రక్తదానంతో పాటు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి.

లింగ నిష్పత్తి వణుకు పుట్టిస్తోంది: డా.వసంత కుమారి

జిల్లాలో లింగ నిష్పత్తి అన్ని వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. కొన్ని మండలాల్లో ప్రతి 1,000 మంది బాలురకు 800 మంది బాలికలు మాత్రమే ఉంటున్నారు. మొదటి కాన్పు బాలిక అయితే రెండో కాన్పునకు ఇష్టపడని వారు ఉండడం విచారకరం. జీవన శైలిలో మార్పుల కారణంగా ప్రతి పది మందిని పరీక్షిస్తే ఆరుగురు పీసీఓడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. రొమ్ము క్యాన్సర్లు గుర్తించడానికి సొంతంగా చేతి స్పర్శతో అవగాహన వస్తుంది. గడ్డలు, కణతులు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించి మామోగ్రఫీ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం. ప్రాథమిక దశలో రోగాలు గుర్తించినట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

సదస్సు ఉపయోగకరంగా ఉందిరావుల శ్రీనివాస్‌రెడ్డి

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సు ఉపయోగకరంగా ఉంది. పట్టణ వాసులు తమ సమస్యలను వైద్యుల ద్వారా పరిష్కరించుకోగలిగారు. బీపీ, చక్కెర వ్యాధితో పాటు యూరిక్ యాసిడ్, గుండె జబ్బులు ఎలా వస్తాయి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుసుకోగలిగాను.

20 ఏళ్ల వారిలోనూ గుండె నొప్పి
డా.నరహరి, గుండెవైద్య నిపుణులు

గతంతో పోల్చితే ఈ మధ్య గుండె నొప్పి బాధితులు పెరుగుతున్నారు. 20 ఏళ్ల వయసు వారు సైతం గుండె నొప్పి బారిన పడుతున్నారు. మద్యం, మాంసాహారం, బేకరీ ఫుడ్, మానసిక ఒత్తిడి, వంశపారంపర్యం వంటి కారణాలతో చక్కెర వ్యాధి, బీపీ, హైకొలెస్ట్రాల్ ముప్పు ఏర్పడుతోంది. ఎడమ వైపు భుజం గుంజడం, ఛాతి మధ్యలో నొప్పి రావడం లక్షణాలతో గుండె నొప్పి వస్తుంది. ఈ లక్షణాలు కన్పిస్తే సమీప వైద్యుడి వద్దకు వెళ్లి ఈసీజీ తీసుకుని నిర్ధారణ చేసుకోవాలి. నిత్యం వ్యాయామం, 30 నిమిషాల యోగా, ధ్యానంతో పాటు శాకాహారం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. కరోనా వ్యాక్సిన్ వల్ల గుండె జబ్బులు వస్తున్నాయనే విషయంలో ఎలాంటి ఆధారాలు లేవు. నెలలో 270 అబార్షన్‌లు జరిగాయి

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

జిల్లాలో గడిచిన నెల రోజుల్లో 270 అబార్షన్‌లు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నిరకాల పథకాలు తెచ్చినా వివక్ష కొనసాగుతోంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో శిశు విక్రయాలు జరుగుతున్నాయి. విటమిన్ల లోపం వల్ల అన్నిరకాల రోగాలు వస్తున్నాయి. బీకాంప్లెక్స్ లోపం రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. వయసుతో పనిలేకుండా టైప్-1, టైప్-2, టైప్-3 మధుమేహంతో పాటు బీపీ వస్తున్నాయి. సరైన వ్యాయామం లేకపోవడం, అర్ధరాత్రి వరకు చరవాణి చూస్తూ నిద్రలేమి, జంక్‌ఫుడ్ వంటి వాటి వల్ల రోగాలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో రోగం గురించి తెలుసుకుని సొంత వైద్యం చేసుకోవడం వల్ల కొత్త సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. వైద్యుల సూచనతో మాత్రలు వాడాలి.

చక్కెర వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందా: అరవింద్

తల్లిదండ్రులకు చక్కెర వ్యాధి ఉంటే పిల్లలకు వస్తుందా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

దీనికి డా.మాతృనాయక్ బదులిస్తూ.. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా పుట్టినప్పటి నుంచే చక్కెర వ్యాధి వస్తోంది. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. సందేహాలు ఉంటే వైద్యుల సూచనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

బీపీ వల్ల మెడనరాలు లాగుతాయా: నవీన్‌నాకు ప్రతిరోజు మెడ నరాలు లాగుతున్నాయి. బీపీ ఉందనే అనుమానం ఉంది.డా.మాతృనాయక్ సమాధానం ఇస్తూ.. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయడంతో పాటు 5 లీటర్ల నీరు తీసుకోవాలి. ఇక్కడే బీపీ పరీక్ష చేయించుకుంటే పరిష్కారం దొరుకుతుంది.

## అసైన్డ్ భూములు..అన్యాక్రాంతం

సంగారెడ్డి : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా జిల్లా ఉండడం.. జిల్లా మీదుగా జాతీయ రహదారులు వెళ్లడం.. త్వరలో ప్రాంతీయ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కసరత్తు సాగడం.. వంటి పరిణామాలతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక వ్యాపారుల, నాయకుల కన్ను అసైన్డ్ భూములపై పడింది. వాటిని విక్రయించొద్దు, కొనుగోలు చేయొద్దని నిబంధనలు చెబుతున్నా, ఎన్‌వోసీలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో అసైన్డ్ భూముల స్వాహాపై ప్రత్యేక కథనం.ఎక్కడెక్కడ.. ఎలా.. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో 152 సర్వే నంబరులో 52 ఎకరాలు, 153 సర్వే నంబరులో 15 ఎకరాలు, 155లో 10 ఎకరాలను ఇద్దరు రాజకీయ నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులకు ఎకరం రూ.కోటి చొప్పున విక్రయించారు. రైతులకు మాత్రం ఒక్కొక్కరికి ఒక్కోతీరుగా చెల్లింపులు చేసినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్లు లేకుండా లీజుకు ఇచ్చినట్లుగా హామీపత్రం తీసుకున్నారని పలువురు వాపోయారు. ఎన్‌వోసీ ఇవ్వడంతో సదరు భూములను వ్యాపారులు తమ పేరిట నమోదు చేసుకోవడం గమనార్హం. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో 404సర్వే నంబరులోని మూడెకరాల అసైన్డ్ భూమిలో సగానికి పైగా స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించారు. 410 సర్వే నంబరులో 10 ఎకరాల వరకు అక్రమార్కులు ప్లాట్లుగా చేశారు. గోవుల గుట్ట సమీపంలో 404/51/5 సర్వే నంబరులో ఎనిమిది ఎకరాల్లో సగానికి పైగా ఇళ్లు కట్టేశారు.

# భూతం మళ్లీ వస్తుందా..!



నల్గొండ : ఫ్లోరిన్ నీళ్లకు ఉమ్మడి నల్గొండ జిల్లా పేరు పొందింది. ఈ జిల్లాలో భూగర్భంలోని నీళ్లలో ఫ్లోరిన్ మోతాదుకు మించి ఉన్నట్టు 1945లోనే నైజాం ప్రభుత్వ వైద్య సలహాదారు పరీక్షలు నిర్వహించి గుర్తించారు. స్థానిక భౌగోళిక పరిస్థితులను బట్టి ఫ్లోరిన్ సమస్య వస్తుందని, ఇగ్నీషియస్ రాళ్లు ఈ జిల్లాలో అధికంగా ఉన్నాయని, ఆ రాతి పొరల నుంచి వచ్చే నీళ్లలో ఫ్లోరైడ్, స్ట్రాంసిన్, యురేనియం, సిలికాన్ లాంటి ప్రమాదకర మూలకాలున్నాయని పలుపరిశోధనల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగర్భంలోని ఈ మూలకాలను తొలగించలేమని, ఆ నీటిని తాగకూడదని ప్రకటించారు. శరీరంలోకి చేరిన ఫ్లోరిన్‌ను సైతం తొలగించ లేమని వైద్య నిపుణులు ప్రకటించారు.

శుద్ధి చేసిన నదీ జలాలు తాగటం, ఆ నీటితో పండించిన ఆహారాన్ని, పాలను తీసుకోవడం వల్ల కొత్తగా ఫ్లోరోసిస్ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునని సూచనలిచ్చారు. దీంతో ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా కృష్ణా, గోదావరి జలాలను తాగునీటిగా అందిస్తున్నారు. జిల్లాలో సాగునీటి కాలువలు లేని చాలా ప్రాంతాల్లో రైతులు భూగర్భంలోకి గొట్టపు బావులను తవ్వి, అక్కడి నుంచి తోడిన నీళ్లతో పంటలు పండిస్తున్నారు. ఫ్లోరిన్ అధికంగా ఉన్న నీళ్లతో పండించినవి తినడంతో ఫ్లోరోసిస్ వ్యాధులు వస్తున్నట్టు ఇటీవల వైద్య నిపుణులు గుర్తించారు. కొన్ని రోజుల క్రితం అన్నెపర్తిలోని ఎంజీ యూనివర్సిటీలోని గొట్టపు బావుల నీటిని సేకరించి మిషన్ భగీరథ ప్రయోగశాలలో విశ్లేషించడంతో భూగర్భంలో ఫ్లోరిన్ యథాతథంగా పరిమితికి మించి ఉన్నట్టు తేలింది.

**గొట్టపు బావుల నీటిలో ఫ్లోరిన్ ఉంది..**

-వెంకటేశ్వర్లు, ఎస్ఈ, మిషన్ భగీరథ, నల్గొండ

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని పదకొండు గొట్టపు బావుల నీటి నమూనాలను ఇటీవల సేకరించాం. వాటిని ప్రయోగశాలలో పరీక్షించాం. అన్నింటిలోనూ ఫ్లోరిన్ గతంలో మాదిరిగా పరిమితికి మించి ఉన్నట్టు తేలింది. ఈ నీళ్లు తాగేందుకు, వంటకు ఉపయోగకరం కాదు. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కోసం రోజుకు 5 లక్షల లీటర్ల శుద్ధి చేసిన భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నాం. బ్రాహ్మణవెల్లెంల, డిండి ఎత్తిపోతల పథకాల ద్వారా కృష్ణా నదీ జలాలు సరఫరా అయ్యాక భూగర్భ జలాలు పెరిగితే గొట్టపు బావుల నీళ్లలో ఫ్లోరిన్ పరిమాణం ఏమైనా తగ్గిందా అనేది మళ్లీ పరీక్షిస్తాం.

# 'సర్వే'త్రా.. సాంకే'తికమక'..!



ఖమ్మం: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యతో సర్వే నిలిచిపోతుంటే.. పట్టణాల్లో సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రక్రియ సాఫీగా సాగటం లేదు. సర్వే యాప్ అప్‌డేట్ అయ్యాక సర్వేయర్లు మరిన్ని ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తొలుత ఒక్కో సర్వేయర్ రోజుకు దాదాపు 40 కుటుంబాల వరకు సర్వే చేయగా.. సాంకేతిక సమస్యలతో ఇప్పుడు 20 కుటుంబాల వివరాలు నమోదు చేయటమే గగనంగా మారింది. లబ్ధిదారుల గుర్తింపునకు నేరుగా అర్హుల ఇళ్ల వద్దే సర్వే చేపడుతుండగా.. యాప్‌లో తలెత్తుతున్న సమస్యలతో తలలు పట్టుకుంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈనెల 25 వరకు సర్వే పూర్తిచేస్తామని అధికారులు తొలుత ప్రకటించినా ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులతో గడువు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది.

**యాప్‌తో ఆపసోపాలు**

యాప్‌లో 14 కాలమ్స్ నింపాలి. తొలుత కొన్ని ప్రశ్నలకు సమాధానాలు పూరించాలి. సొంత ఇంట్లో ఉంటున్నారా? అద్దె ఇంట్లో నివసిస్తున్నారా? అనే వివరాలు పొందుపరచాలి. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటోలతో పాటు ఖాళీ స్థలం కలిగి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఖాళీ జాగా ఉందనే వివరాలు నమోదుచేశాక సంబంధిత వ్యక్తి పేరిట ఆ స్థలం ఉందా, ఇతర కుటుంబ సభ్యుల పేరిట ఉందా అన్నది పూరించాలి. డాక్యుమెంట్ వివరాలు నమోదుచేయాలి. విద్యుత్తు బిల్లు నిక్షిప్తపరచాలి. స్థలం ఫొటో, స్థలం డాక్యుమెంట్ పొందుపరచాలి. చివరగా సర్వే రిమార్క్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులా కాదా అన్నది రాయాలి. అయితే ఇలాంటి సమయంలో అనేకసార్లు యాప్ సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రక్రియ ముందుకు సాగటం లేదు. ఒక్కో ఇంటి వద్ద గంటల కొద్దీ సర్వేయర్లు నిరీక్షించాల్సి వస్తోంది. కొన్నిచోట్ల అర్హులు అందుబాటులో ఉండటం లేదు.

**ఉభయ జిల్లాల్లో..**

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ఖమ్మం జిల్లాలో 3,57,869, భద్రాద్రి జిల్లాలో 2,79,638 మంది దరఖాస్తు చేశారు. వీరిలో అర్హులను తేల్చేందుకు అధికారులు సర్వేకు శ్రీకారం చుట్టారు. ఖమ్మం జిల్లాలో 586, భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీలకు కార్యదర్శులను సర్వేయర్లుగా నియమించారు. వారు లేనిచోట్ల ఇతర శాఖల సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం నగర, పురపాలికల్లో 125 మంది చొప్పున వార్డు అధికారులు సర్వే చేస్తున్నారు. 500 కన్నా ఎక్కువ దరఖాస్తులు అందిన ప్రాంతాలకు అదనంగా సర్వేయర్లను అధికారులు కేటాయించారు. ఈనెల 7, 8 తేదీల్లో సర్వేకు సంబంధించిన ఇళ్ల గుర్తింపు ప్రక్రియ జరిగింది. ఈనెల 9 నుంచి దరఖాస్తుదారుల ఇళ్లకు సర్వేయర్లు వెళ్తున్నారు. గృహ నిర్మాణశాఖ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదుచేస్తున్నారు. పది రోజులు గడుస్తున్నా ఇళ్ల సర్వే ఆశించిన స్థాయిలో సాగటం లేదు.

సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా సర్వే వేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 1.25 లక్షల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు తలెత్తుతుండటంతో ఎక్కువ సమయం పడుతోంది. యాప్‌లో కొన్ని మార్పులు చేసి సర్వే నిర్వహిస్తున్నాం. లబ్ధిదారుల గుర్తింపు అనేది ప్రాధాన్యాంశం. ఈనెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గడువులోగా సర్వే పూర్తిచేస్తాం. బి.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ ఈఈ, ఖమ్మం

# సాంకేతికతతో అక్రమాలకు అడ్డుకట్ట



సంగారెడ్డి : పురపాలికల్లో జనన, మరణ ధ్రువపత్రాల జారీలో అక్రమాలకు చెక్ పెట్టేలా ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. కార్యాలయానికి వెళ్లకుండానే నేరుగా ఇంటి వద్దనే తీసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసి.. సంబంధిత పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో పొందాల్సి ఉండేది. అక్కడ డబ్బులు ఇస్తేనే త్వరగా జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తారనే విమర్శలున్నాయి. లేదంటే ఏదో ఒక సాకు చూపుతూ.. నెలలపాటు పెండింగ్‌లో పెడుతున్నారనే విమర్శలున్నాయి. వీటిపై పురపాలక రాష్ట్ర కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో అక్రమాలకు చెక్ పేట్టేలా కార్యచరణ చేపట్టారు.

**మంజూరు ఇలా..:** జిల్లాలో 8 పురపాలక సంఘాలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఆసుపత్రిలో జనన, మరణం జరిగిన వెంటనే.. అక్కడి నుంచే సంబంధిత కుటుంబీకుల చరవాణికి లింక్ పంపించేలా ఏర్పాట్లు చేశారు. ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే వివరాలు నమోదు చేయాలి. ఓటీపీ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత వివరాలన్నీ వాస్తవంగా ఉంటే సంబంధిత పురపాలికకు

సమాచారం వెళ్తుంది. కమిషనర్ డిజిటల్ సంతకంతో సంబంధిత పత్రం మంజూరు చేస్తారు. మీ-సేవ కేంద్రానికి వెళ్లి జనన, మరణ ధ్రువపత్రం తీసుకోవచ్చు. నూతన విధానంతో పురపాలికల్లో జనన, మరణ పత్రాల జారీకి జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు భావిస్తున్నారు.

**ఏడాది దాటితే పాత విధానమే..**

పురపాలికల పరిధిలో జనన, మరణాలకు సంబంధించి ఏడాది దాటితే మాత్రం పాత విధానాన్నే అమలు చేస్తున్నారు. మొదట మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేయాలి. అనంతరం ఆర్డీవో ప్రొసీడింగ్స్‌కు దరఖాస్తు వెళుతుంది. దీనికి మూడు నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత జనన, మరణ ధ్రువపత్రం కోసం పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

## వంతెన కల నెరవేరేదెలా?

పెద్దపల్లి: గోదావరి నది, మానేరు వాగుల నడుమ జిల్లా విస్తరించి ఉండటంతో ప్రజలకు వంతెనల ఆవశ్యకత ఏర్పడింది. పొరుగు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి వారధులు లేకపోవడంతో గ్రామీణులు ఆర్థిక, దూరాభారాలతో ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఎండకాలం మినహా మిగతా కాలాల్లో రైళ్లు, బస్సుల్లో వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గోదావరిపై గోదావరిఖని, రాయపట్నం, కాళేశ్వరం వద్ద గల వంతెనలు.. సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు జిల్లావాసులు మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఉపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరో ప్రధానమైన యేరు(మానేరు)పై మూడు వంతెనలున్నాయి. మానేరు వాగు గ్రామీణ ప్రాంతాల గుండా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు వంతెనల కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై రూ.80 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో మరికొన్ని గ్రామాల్లో కూడా వంతెనల నిర్మాణానికి ప్రజల నుంచి డిమాండ్ పెరిగింది. కాగా కొన్ని ప్రాంతాల్లో వంతెనలు ఉన్న పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. అలాంటి వాటిపై కథనం.

నెరవేరని స్పీకర్ హామీ

కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణా



నికి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి హామీ ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల నుంచి మానేరులో నిర్మించిన తాత్కాలిక మట్టిరోడ్డుపై కిష్టంపేట వరకు ద్విచక్రవాహనంపై ఆయన వచ్చి వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం మారడంతో వంతెన హామీ వరకే ఆగిపోయింది.

గాలికి కూలిన వంతెనముత్తారం మండలం ఓడెడ్ సమీపంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 2016లో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే భూపాలపల్లి వెళ్లేందుకు సమీప ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. కానీ వంతెన పలు సందర్భాల్లో వరదలకు కొట్టుకుపోవడం, గాలులకు పడిపోవడం జరిగింది. నిర్మాణ వ్యయం రూ.50 కోట్లకు పెరిగినప్పటికి నాణ్యత లోపాలతో వంతెన నిర్మాణం కలగానే ఉంది.

అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగం

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, మానకొండూర్ మండలం వేగురుపల్లి మధ్య మానేరుపై 2016లో రూ.20 కోట్లతో వంతెన నిర్మించారు. కానీ దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. వంతెనకు ఇరువైపులా ప్రభుత్వం అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులే రోడ్డు వేసుకున్నారు. ఈ వంతెనపై నుంచి ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు ఇతర వాహనాలు మాత్రమే వంతెనను వినియోగించుకుంటున్నాయి.

## పశువైద్యం.. దైన్యం..!

మేళ్లచెరువు : ప్రభుత్వ పశు వైద్యశాలల్లో జీవాలకు ఉచిత వైద్యంతోపాటు మందులు పంపిణీ చేయాల్సి ఉంది. అవేమి అందక పాడి రైతు సొంతంగా ఖర్చు చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అరకొరగా మందుల పంపిణీ జరుగుతుండటంతో బయట కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఔషధాలు సరఫరా అవుతున్నా రైతుల దరి చేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోగ నిర్ధారణ పరీక్షలు కరవు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5,39,406 పశువులు ఉన్నాయి. వీటికి సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ఇవి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నా పాడిరైతులకు మాత్రం అందటం లేదు. పశువులకు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదు. ఏమైనా రోగాలొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని పెంపకందారులు చెబుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా పరీక్షల నిర్వహణలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ అధికారులు దాటవేస్తున్నారు.

రవాణా భారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పశువైద్యశాలకు సంబంధించిన అంబులెన్సులు ఎక్కడా లేవు. ఉమ్మడి జిల్లాలో 277 పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటికి ఒక్క అంబులెన్సు కూడా కేటాయించలేదు. దీంతో పశువులకు ఏమైనా చికిత్స అవసరమొస్తే మండల




కేంద్రాలకు తీసుకెళ్లడానికి పాడిరైతులు నానా తంటాలు పడుతున్నారు. సొంతంగా వాహనాలను సమకూర్చుకొని తరలిస్తున్నారు.

బయట కొనమంటున్నారు
నాగిరెడ్డి, పాడిరైతు, మేళ్లచెరువు

పాడి గేదెలు అనారోగ్యానికి గురైతే పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లేవాళ్లం. అక్కడ ఒకటి రెండు మందులు ఇచ్చి మిగతావి బయట కొనుక్కోమనేవాళ్లు. ఒక్కోసారి అవి కూడా లేవని చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వడం లేదని సమాధానమిస్తున్నారు. ఇలాంటప్పుడు ఆసుపత్రికి ఎందుకని బయటనే వైద్యం చేయిస్తున్నాం.

ప్రతిపాదనలు పంపిస్తాంశ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేట జిల్లాలో పశువైద్యశాఖకు సంబంధించిన అంబులెన్సు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంచార వాహనాలతో రైతుల వద్దకు వెళ్లి చికిత్స అందిస్తున్నాం.



# చీనాబ్‌పై వందే భారత్ చికుబుకు..

జమ్ముకశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై మరో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచిన ఈ చారిత్రక వంతెనపై తొలిసారి వందే భారత్ రైలు పరుగులు పెట్టింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ సెమీ హైస్పీడ్ వందేభారత్ రైలు ట్రయల్ రన్‌ను భారత రైల్వే శనివారం ప్రారంభించింది. కాత్రాలోని శ్రీ మాతా వైష్ణోదేవి రైల్వేస్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలు ప్రయాణించింది. ఈ మార్గమధ్యంలో చీనాబ్ నదిపై నిర్మించిన వంతెన ప్రధాన ఆర్చ్‌పై రైలు పరుగులు పెడుతున్న దృశ్యాలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కశ్మీర్ లోయలోని అతిశీతల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఈ వందే భారత్ రైలును ప్రత్యేకంగా రూపొందించారు. నీరు గడ్డ కట్టకుండా ఉంచేలా అత్యాధునిక హీటింగ్ వ్యవస్థలను ఇందులో ఏర్పాటుచేశారు. కాగా.. గతేడాది జూన్‌లో ఈ వంతెనపై రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపుర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తునున్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం.

# నిర్మాణంలో లోపాలుంటే బాధ్యులపై చర్యలు: ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం: మధురపూడి (రాజమహేంద్రవరం) విమానాశ్రయంలో జరుగుతున్న టెర్మినల్ భవన నిర్మాణ పనుల్లో ఇనుప కడ్డీలు ఊడిపడిన నేపథ్యంలో ఎంపీ పురందేశ్వరి ఘటనా స్థలిని పరిశీలించారు. ఘటనపై అధికారులతో సమీక్షించారు. కూలిన సమయంలో అదృష్టవశాత్తూ కార్మికులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. నిర్మాణ పనులు చేస్తున్న చెన్నై రెనాటస్ ప్రాజెక్ట్స్ ఎండీ మనో పూసప్పన్, వైఎస్ ప్రెసిడెంట్ కరు బాకరన్, ప్రాజెక్టు డీజీఎం శరవణన్‌లను.. ఘటనపై ఎంపీ నిలదీశారు. ఈ విషయంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడినట్టు చెప్పారు. ఇప్పటికే విమానయాన శాఖ అధికారులు, ఐఐటీ నిపుణుల బృందం విచారణ చేస్తోందని తెలిపారు. నివేదిక అందిన తర్వాత నిర్మాణంలో లోపాలు ఉన్నట్టు తెలితే బాధ్యులపై చర్యలు ఉంటాయని పురందేశ్వరి స్పష్టం చేశారు.

# మై ఫ్రెండ్ బిల్‌గేట్స్‌కు థాంక్స్: సీఎం చంద్రబాబు పోస్ట్




అమరావతి: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ త్వరలో ఓ పుస్తకాన్ని విడుదల చేయనున్నారు. దానికి సంబంధించిన కాపీని తనకు బహూకరించినందుకు ఏపీ సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "సోర్స్ కోడ్' పేరిట నా స్నేహితుడు బిల్‌గేట్స్ పుస్తకం విడుదల చేస్తున్నారు. త్వరలో విడుదలకానున్న పుస్తక కాపీ నాకు బహూకరించినందుకు ధన్యవాదాలు. బిల్‌గేట్స్ తన జీవిత ప్రయాణంలోని అనుభవాలు, పాఠాల సమాహారంగా ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. కళాశాల వదిలి మైక్రోసాఫ్ట్ ప్రారంభ నిర్ణయం వరకు ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకం. బిల్‌గేట్స్‌కు మా శుభాకాంక్షలు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# విజయసాయి రాజకీయ సన్యాసంపై చంద్రబాబు రియాక్షన్..




అమరావతి, జనవరి 25: వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి రాజకీయాలకు గుడ్‌బై చెప్పేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఈరోజు ఉదయం వైసీపీ రాజ్యసభ సభ్యత్వానికి కూడా విజయసాయి రాజీనామా చేశారు. ఢిల్లీలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్కడ్‌ను కలిసి రాజీనామ పత్రాన్ని కూడా అందజేశారు. ఇదిలా ఉండగా.. విజయసాయి రెడ్డి రాజకీయ సన్యాసంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. విజయసాయి రాజీనామా అనేది వాళ్ల పార్టీ అంతర్గత సమస్య అని అన్నారు. ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చని తెలిపారు. "నేను అంతకుమించి ఆ విషయం పై కామెంట్ చేయను" అని స్పష్టం చేశారు. సింగపూర్ వాళ్లకు కూడా జగన్ ప్రభుత్వం విధ్వంసం చూపించిందని.. అందువలనే వాళ్ళు రావడానికి విముఖత చూపించారని తెలిపారు. ఏపీ అంటే గ్లోబల్‌గా అసహ్యం వేసే పరిస్థితికి తీసుకువచ్చారని మండిపడ్డారు. రాజకీయాల్లో అర్హత లేని వ్యక్తులు వస్తే ఇటువంటి పరిస్థితి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేశారు.

**రేవంత్ వ్యాఖ్యలపై..** ఏపీకి హైదరాబాద్ లేదు అని రేవంత్ రెడ్డి అన్న వ్యాఖ్యలపై స్పందించిన సీఎం.. "నేను హైదరాబాద్‌ను తెలుగు కమ్యూనిటీ కోసం డెవలప్ చేశాను.. దానిని ఎవరూ ఎలా చెప్పుకున్నా పర్వాలేదు" అని తెలిపారు.. జిందాల్ కూడా దావోస్ వచ్చారని... కడప స్టీల్ గురించి స్టార్ట్ చేయమని చెప్పినట్లు తెలిపారు. 95 వేల కోట్లు రూపాయలతో బీపీసీఎల్ రిఫైనరీ ఏపీలో స్టార్ట్ కాబోతుందన్నారు. ఆరునెలల్లో డీఆర్పీ రెడీ అవుతుందన్నారు. దేనికోసం దావోస్ వెళ్లి ఎంవోయూ ఎందుకు చేసుకోవాలని... అవసరం లేదుగా..ఎంవోయూలు చేసుకుంటేనే పరిశ్రమలు వచ్చినట్లు కాదన్నారు. మనం చేసే నెట్వర్క్ వలన భవిష్యత్‌లో పరిశ్రమలు వస్తాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌ను గతంలో అలానే డెవలప్ చేశానని.. అక్కడే తన తరువాత వచ్చిన వాళ్ళు హైటెక్ సిటీని ఎవరూ కూల్చలేదన్నారు. ఏపీలో ప్రజలు వచ్చి తనను కలిసే ప్రజా వేదికను కూల్చేశారని... ఆ తరువాత కూడా విధ్వంసం జరిగిందన్నారు. వ్యవస్థలు కూడా విధ్వంసం జరిగాయన్నారు. రాజధాని లేకుండా చేసి మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. గన్నవరం ఎయిర్పోర్ట్ కు వచ్చే విమానాలు కూడా తగ్గిపోయాయని తెలిపారు. వారికి ఇచ్చే రాయితీలు కూడా జగన్ ఆపారన్నారు. మళ్ళీ వీటన్నిటినీ సరిదిద్దుతున్నానని... మళ్ళీ పునర్నిర్మాణం చేస్తున్నానని చెప్పారు. అందువలనే మనం ముందు వీటిపై దృష్టి పెట్టాలి.. వీటితో పాటు పరిశ్రమలు కూడా తెచ్చుకోవాలన్నారు. మన ఫ్రెండ్ షిప్, మన నెట్వర్క్ తప్పనిసరిగా పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



# గుండెపోటని ఎందుకు చెప్పానంటే

రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు అబద్ధాలు చెప్పలేదన్న విజయసాయిరెడ్డి వివేకానందరెడ్డికి గుండెపోటని ఎందుకు అబద్ధం చెప్పారని మీడియా ప్రశ్నించింది. దీనిపై మొదటిసారి విజయసాయి స్పందిస్తూ.. వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత తనకు ఓ వ్యక్తి ఫోన్ చేసి విషయం చెప్పారని, వెంటనే తాను ఆశ్చర్యపోయానన్నారు. వెంటనే పులివెందులలో ఉన్న కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఫోన్ చేశానన్నారు. అవినాష్ రెడ్డి పక్కన ఉండే ఓ వ్యక్తి గుండెపోటుతో వివేకానందరెడ్డి చనిపోయారనే విషయాన్ని తనకు చెప్పారని, అదే సమాచారాన్ని మీడియాకు తెలియజేశానన్నారు. గుండెపోటుతో చనిపోయారని అవినాష్ రెడ్డి చెప్పారా అని పాత్రికేయులు అడగ్గా.. దీనిపై గుచ్చిగుచ్చి అడగవద్దన్నారు. తాను అవినాష్ రెడ్డికి ఫోన్ చేసిన మాట వాస్తవమేనని, ఆయన పక్కనే ఉన్న మరో వ్యక్తికి ఫోన్ ఇచ్చిన మాట వాస్తవమన్నారు. అవినాష్ రెడ్డి పక్కన ఉన్న వ్యక్తి చెప్పిన విషయం తాను మీడియాలో చెప్పానన్నారు.

**కత్తిపోటును.. గుండెపోటుగా..** వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గుండెపోటుతో వివేకానందరెడ్డి చనిపోయారని చెప్పారు. ఆ తర్వాత రక్తపు మరకలు ఉండటంతో వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోలేదని, హత్య చేశారనే అనుమానంతో వివేకానందరెడ్డి కుమార్తె సునీత సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం సీబీఐ విచారణకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో సునీత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చివరకు కోర్టు ఆదేశాలతో వివేకానందరెడ్డిని హత్య చేశారని ప్రాథమిక విచారణలో తేల్చారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. దాదాపు ఆరేళ్ల తరువాత విజయసాయిరెడ్డి గుండెపోటుతో వివేకానందరెడ్డి చనిపోయారని ఎందుకు చెప్పాల్సి వచ్చిందో చెప్పారు.

# జగన్‌తో విభేదాలు లేవు
# వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా




దిల్లీ: వ్యక్తిగత కారణాలతోనే వైకాపా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని విజయసాయిరెడ్డి తెలిపారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా లేఖ సమర్పించానని.. దాన్ని ఆయన ఆమోదించారని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. "ఇంకా మూడున్నరేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేశాను. రాజీనామా మాత్రమే కాదు.. రాజకీయాల నుంచి కూడా వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వైకాపా 2019లో 151 స్థానాలు సాధించింది. 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి 40 శాతం ఓటింగ్ వచ్చింది. జగన్ అత్యంత ప్రజాదరణ గల నాయకుడు. నాలాంటివాళ్లు వెయ్యి మంది వీడినా ఆయనకు ఉన్న ఆదరణ తగ్గదనేది నా ఉద్దేశం. రాజీనామా నిర్ణయాన్ని లండన్ పర్యటనలో ఉన్న జగన్‌కు ఫోన్‌లో వివరించాను. వైకాపాకు 11 మంది ఎమ్మెల్యేల బలమే ఉంది. నా రాజీనామాతో కూటమి లబ్ధి పొందుతుంది" అని విజయసాయిరెడ్డి అన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానమిచ్చారు. "సుదీర్ఘ రాజకీయ జీవితంలో నాకు తెలిసి ఏరోజూ అబద్ధాలు చెప్పలేదు. హిందూ ధర్మాన్ని, వెంకటేశ్వరస్వామిని నమ్మిన వ్యక్తిగా అబద్ధాలు చెప్పను. వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధముంది. వైఎస్ రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జగన్.. ఇలా మూడు తరాలుగా ఆ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారితో విభేదాలు లేవు.. భవిష్యత్తులోనూ రావు. 2011 ఆగస్టు 10న ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఆ కేసుల్లో అప్రూవర్‌గా మారాలని ఎంత బలవంతపెట్టినా నిరాకరించాను. దైవాన్ని నమ్మిన వ్యక్తిగా నమ్మకద్రోహం, మోసం చేయడం నాకు తెలియదు.

**నాకు ఏ వ్యాపారాలు లేవు..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపై కాకినాడ సీపోర్టుకు సంబంధించిన కేసు పెట్టారు. లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈడీ విచారణకు హాజరయ్యాను. కేవీ రావుతో సన్నిహిత సంబంధాలు, వ్యాపార లావాదేవీలు లేవని చాలా స్పష్టంగా చెప్పాను. కేవీ రావు చెప్పేది నిజమైతే ఆయన తన పిల్లలపై ప్రమాణం చేయాలి. కేసు పెట్టాకే కాకినాడ సీపోర్టు లావాదేవీల విషయం తెలిసింది. విక్రాంత్‌రెడ్డితో నాకున్న పరిచయం తక్కువ. నాకు ఏ వ్యాపారాలు లేవు.. నేను దేనిలోనూ భాగస్వామిని కాదు. 365 రోజులూ పార్టీ కోసమే పనిచేశా.

వ్యాపార లావాదేవీలపై నాతో మా వియ్యంకుడు ఏరోజూ చర్చించలేదు. కుటుంబ వ్యవహారాలు బాగుండాలంటే ఆర్థిక, వ్యాపార లావాదేవీలు ఉండకూడదని బలంగా నమ్ముతా.

**అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారు? :** రాజకీయాల నుంచి తప్పుకొంటే ఇంకా బలహీనుడిని అవుతాను. అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారు?నన్ను ఎందుకు తప్పిస్తారు? నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేరు. రాజ్యసభ ఎంపీగా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి న్యాయం చేయలేను. నాకంటే శక్తి సామర్థ్యాలు ఉన్న వ్యక్తులు రాజ్యసభకు వస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారనే కారణంతో రాజీనామా నిర్ణయం తీసుకున్నాను. నాకు ఎవరిపైనా కోపంలేదు.. రాజీనామాలో ఎవరి ఒత్తిడీ లేదు. ఎవరికీ భయపడే తత్వం నాది కాదు. దేన్నైనా ధైర్యంగా ఎదుర్కొంటాను"అని విజయసాయిరెడ్డి అన్నారు.

# విజయసాయి రెడ్డి రాజీనామా డ్రామా..!




అనకాపల్లి, జనవరి 25: రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన ప్రకటన ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. విజయసాయి నిర్ణయంపై రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు స్పందిస్తున్నారు. వైసీపీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తుంటే..కూటమికి చెందిన నాయకులు మాత్రం విజయసాయిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందినకాడికి దోచుకుని.. ఇప్పుడు అస్త్ర సన్యాసం అని డైలాగ్స్ వదిలితే.. తాము వదిలిపెట్టబోమని తేల్చి చెబుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో అక్రమాలకు పాల్పడిన విజయసాయిరెడ్డిని విడిచిపెట్టేది లేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

**అంతా డ్రామా..** ఈ క్రమంలోనే తాజాగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ స్పందించారు. విజయసాయి రెడ్డి రాజీనామాపై సంచలన కామెంట్స్ చేశారు. విజయసాయి రెడ్డి రాజీనామా పేరుతో డ్రామాలాడుతున్నారంటూ విమర్శించారు. ఉత్తరాంధ్రలో విజయసాయి రెడ్డి చేసిన అరాచకాలపై తానే ఫిర్యాదు చేస్తానని అన్నారు. విజయసాయి వల్ల ఆర్థికంగా గానీ.. మానసికంగా గానీ.. ఇబ్బందులకు గురైతే నేరుగా ఫిర్యాదు చేయాలంటూ బాధితులకు విజయ్ పిలుపునిచ్చారు. రాజీనామా పేరుతో తప్పించుకోవాలని చూస్తున్నాడంటూ విజయసాయిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారాయన. వైసీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో అరాచకాలు సృష్టించి నాశనం చేశారని విజయ్ ఆరోపించారు. కాల్చేసి.. బూడిద చేసి నవ్వుకునే శాడిస్ట్ ఈ విజయసాయి రెడ్డి అంటూ తీవ్ర వ్యాలు చేశారు. జగన్, విజయసాయి రెడ్డి డ్రామాలో భాగమే ఈ రాజీనామా అంశం అని టీడీపీ నేత విజయ్ ఆరోపించారు. ఉత్తరాంధ్రలో డబ్బులు దోచేసి, వనరులు నాశనం చేసి, నాయకులను ఇబ్బందులకు గురి చేశారని.. అలాంటి విజయసాయి రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని విజయ్ స్పష్టం చేశారు. షర్మిల పార్టీకి రాజీనామా చేసినప్పుడు ఎవరు బాధపడలేదని.. ఇప్పుడు విజయసాయిరెడ్డి రాజీనామా చేస్తే.. ఏదో జరిగిపోయింది అన్నట్టు డ్రామాలకు తెర తీశారు ఆగ్రహం వ్యక్తం చేశారాయన.

# విజయసాయి ఇప్పటికైనా నిజాలు బయటపెట్టు.. షర్మిల చురకలు




విజయవాడ: వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజకీయ సన్యాసంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాట్ కామెంట్స్ చేశారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికు ఏం చెప్పకుండా విజయసాయి రెడ్డి రాజీనామా చేయరని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విజయసాయి రెడ్డిపై షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. తన కుటుంబం, తన పిల్లల మీద ఇష్టం వచ్చినట్లుగా విజయసాయిరెడ్డి మాట్లాడారని చెప్పారు. వైసీపీని ఆయన వీడారంటే చిన్న విషయం కాదన్నారు. జగన్‌ను వీసారెడ్డి వంటి వారే వదిలి వేస్తున్నారంటే ఆలోచన చేయాలని అన్నారు. ఒక్కొక్కరుగా జగన్‌ను వదిలి బయటకు వస్తున్నారని చెప్పారు. జగన్ నాయకుడిగా ఓడిపోయాడు.. విశ్వాసనీయతను కోల్పోయారని వైఎస్ షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకే జగన్ తన అనుకున్నవారంతా వైసీపీ నుంచి వెళ్లిపోతున్నారని అన్నారు. బీజేపీకి, మోదీకి జగన్ దత్త పుత్రుడు అని విమర్శించారు. ఇంతకాలం వీసారెడ్డిని బీజేపీ దగ్గర ఉంచే కేసుల విచారణ సాగకుండా జగన్ చేశారని ఆరోపించారు. ఇప్పుడు విశ్వాసనీయతను జగన్ కోల్పోయారని విమర్శలు చేశారు. విజయసాయి రెడ్డి గతంలో ఎన్నో అబద్దాలు చెప్పారన్నారు. ఇప్పడైనా అన్ని నిజాలు ఆయన బయట పెట్టాలని చెప్పారు. మాజీ మంత్రి వివేకా కేసులో కూడా జగన్ చెప్పమన్న విధంగా అబద్దాలు చెప్పారన్నారు. వీసా రెడ్డి అన్నీ నిజాలు చెబితే.. ప్రజలు ఇప్పుడైనా హర్షిస్తారని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

**సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలం :** సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో చంద్రబాబు, కూటమి నేతలు ప్రచారం ఊదరగొట్టారన్నారు. మీ హామీలపై మీకే నమ్మకం లేకపోతే ఎలా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ అన్నారని... కానీ రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. తల్లికి వందనం పేరుతో ఒక్కో బిడ్డకు రూ.15 వేలు అన్నారని.. కానీ రాష్ట్రంలో ఒక్క బిడ్డకైనా మీరు డబ్బులు ఇచ్చారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పిల్లల ఫీజులు కట్టారని చెప్పారు. మహాశక్తి అన్నారు.. మహిళల బాధ్యత తమది అన్నారని.. కానీ నెలకు రూ.1500 కూడా ఎందుకు ఇవ్వట్లేదని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

**నిరుద్యోగ భృతి ఏదీ..** ఏడు నెలలుగా అధికారంలో ఉన్న మీరు ఎందుకు హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఏపీలో యాభై లక్షల మంది నిరుద్యోగులు ఉంటారని అంచనా వేశామన్నారు. దేశంలోనే నిరుద్యోగంలో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. చంద్రబాబు చెప్పిన ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని షర్మిల అన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ అని చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. ఈ హామీల అమలుపై చంద్రబాబు ప్రజలకు ఏం చెబుతారని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు అసలు దిక్కు లేదన్నారు. జగన్ జమానాలో చేసిన మోసాలను సరి చేస్తామని చెప్పిన చంద్రబాబు కూడా పేదలను మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అని తాము అంటున్నామన్నారు. ప్రజల కోసం చేసే కార్యక్రమాలను మీడియా కవర్ చేయాలని వైఎస్ షర్మిల అన్నారు.

# విజయసాయి చట్టం నుంచి తప్పించుకోలేరు: గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం: ఎంపీ పదవికి విజయసాయిరెడ్డి రాజీనామా చేసినా చట్టం నుంచి తప్పించుకోలేరని తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విజయసాయితో విశాఖపట్నంలో పడిన ఇబ్బందులు, జరిగిన విధ్వంసం, దాడులను ప్రజలు మరిచిపోలేదని చెప్పారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. "వైకాపా మునిగిపోయిన నావ అని ఎప్పుడో చెప్పాం.. ఇప్పుడు అది నిజమవుతోంది. జగన్ నైజమే దీనికి కారణం. మరికొంతమంది ఆ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. వైకాపా నేతలు కళ్లుండీ చూడలేని కబోదులు. స్టీల్‌ప్లాంట్‌పై ఇంకా వక్రంగానే మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రావడానికి భయపడుతున్నారు. దావోస్ వెళ్లి పారిశ్రామికవేత్తల్లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నమ్మకం కలిగించారు. ఏపీ బ్రాండ్‌ను వారికి వివరించారు" అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

## ఫెమీనా కవర్‌పై రష్మిక మందన్న ఫోజ్

వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది రష్మిక మందన్న. అగ్ర హీరోల సినిమాల్లో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలతో అదరగొడుతోంది. యానిమల్, పుష్ప 2 లాంటి బ్లాక్ బస్టర్ హిట్స్ లో నటించిన రష్మిక మందన్న తదుపరి 'చావా' లాంటి భారీ హిస్టారికల్ డ్రామాలో నటించింది. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ భార్య ఏసుభాయి పాత్రలో రష్మిక నటించింది. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఇంతకుముందు కాలికి గాయంతో కుంటుకుంటూ చావా ప్రచార కార్యక్రమంలో రష్మిక పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు రష్మిక మందన్న వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో దర్శనమిస్తున్నాయి. తాజాగా ఫెమినా




ఇండియా కవర్ ఫోటోషూట్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. రష్మిక నేటితరంలో దూసుకుపోతున్న గ్రేట్ సూపర్ స్టార్ అంటూ ఫెమీనా కీర్తించింది. ఈ సంవత్సరాన్ని రష్మిక మందన్నతో ప్రారంభిస్తున్నాం! అంటూ ఫెమీనా ఆనందం వ్యక్తం చేసింది. నేటి ప్రపంచంలో సూపర్ స్టార్ అంటే ఏమిటో రష్మిక రీడిఫైన్ చేస్తున్నారు. పుష్ప 2 అద్భుతమైన విజయంతో, ఈ అందాల సుందరి మన తరంలో అత్యంత ఆరాధించే కథానాయికలలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. తన అసమాన ప్రతిభ, ఆకర్షించే ఉనికి, సరిహద్దులు దాటి ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే సామర్థ్యంతో రష్మిక లక్షలాది మందిని ఆకర్షిస్తూనే ఉంది. ప్రపంచాన్ని ఆక్రమించుకుంటున్న ఆ స్టార్ గురించి ప్రత్యేక కథనమిది.. అంటూ ఫెమినా ప్రత్యేక స్టోరిని షేర్ చేసింది.

## మెహరీన్.. ఎన్నాళ్ళకి మళ్ళీ ఇలా..

'కృష్ణగాడి వీరప్రేమగాథ' సినిమాతో 2016లో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన అందాల భామ మెహరీన్ పిర్జాదా. ఈ పంజాబీ ముద్దుగుమ్మ మొదటి చిత్రంతోనే సక్సెస్ అందుకోవడంతో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. తరువాత 'ఫీలౌరి' సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. తరువాత తెలుగులో శర్వానంద్ కి జోడీగా 'మహానుభావుడు' మూవీ చేసింది. ఈ సినిమా సక్సెస్ అయ్యింది. 'రాజా ది గ్రేట్' సినిమాలో రవితేజతో జతకట్టి బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇలా వరుస విజయాలు రావడంతో మెహరీన్ క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగు, తమిళ్, పంజాబీ భాషలలో వరుసగా మూవీస్ చేసింది. అయితే తెలుగులోనే ఆమె ఎక్కువ అవకాశాలు అందుకుంది.




అయితే తరువాత ఆమెకి ఆశించిన స్థాయిలో సక్సెస్ లు రాలేదు. 'ఎఫ్ 3'తో ఆమె చివరిగా హిట్ అందుకుంది. గత ఏడాది 'స్పార్క్' అనే మూవీలో కొత్త హీరోతో జత కట్టింది. ఈ సినిమా తర్వాత తెలుగులో ఇప్పటి వరకు మెహరీన్ నుంచి కొత్తసినిమా ప్రకటనలు ఏవీ రాలేదు. కన్నడంలో ఒక సినిమా చేస్తోన్న అది కూడా ఇంకా స్టార్ట్ కాలేదు. చేతిలో సినిమాలు లేకపోవడంతో మెహరీన్ సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. ఈ ఫ్రీ టైంలో హ్యాపీగా నచ్చిన దేశాలు ఈ అమ్మడు తిరిగేస్తోంది. తాజాగా థాయ్ లాండ్ లో గ్రీన్ ఎలిఫెంట్ అభయారణ్యం పార్క్ లో ఏనుగుతో కలిగి దిగిన ఫోటో, వీడియోని మెహరీన్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది.

ఈ ఫోటో ఇప్పుడు వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ స్కర్ట్స్ లో చాలా స్లిమ్ గా క్రేజీ లుక్స్ తో ఈ అమ్మడు కట్టిపడేస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే నేచర్ ని ఈ అమ్మడు బాగా ఆశ్వాదిస్తోన్నట్లు కనిపిస్తోంది. అయితే మెహరీన్ ని మరల వెండితెరపై చూడాలని ఆమె ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. మరి 2025లో అయిన కొత్త సినిమా స్టార్ట్ చేస్తుందా లేదా అనేది వేచి చూడాలి.




## బాలీవుడ్ ఆడియన్స్ కి డాకు ఎక్కాడా..?




నందమూరి బాలకృష్ణ కె ఎస్ బాబీ కాంబోలో వచ్చిన డాకు మహారాజ్ సంక్రాంతికి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చి సక్సెస్ అందుకుంది. ఈ సినిమా విషయంలో మేకర్స్ ముందు నుంచి చాలా కాన్ఫిడెన్స్ తో ఉండగా రిలీజ్ తర్వాత అదే రిజల్ట్ వచ్చింది. ఐతే ఈ సినిమాను కేవలం తెలుగు ఆడియన్స్ కే కాకుండా హిందీ ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చే పనులు మొదలు పెట్టారు. సంక్రాంతికి రిలీజైన సినిమా రిజల్ట్ చూసిన తర్వాత హిందీ రిలీజ్ డేట్ లాక్ చేశారు. రిపబ్లిక్ వీకెండ్ కలిసి వచ్చేలా డాకు మహారాజ్ హిందీ వెర్షన్ ఈ శుక్రవారం రిలీజ్ చేశారు. బాలకృష్ణ సినిమాలు హిందీలో అది కూడా సినిమా రిలీజ్ అయిన రెండు వారాలకే డబ్బింగ్ వెర్షన్ హిందీ రిలీజ్ అవ్వడం చాలా అరుదు. అఖండ సినిమా డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్ లో రికార్డ్ వ్యూస్ రాబట్టింది. అఖండ 2 ని డైరెక్ట్ పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. దానికి ముందు శాంపిల్ గా డాకు మహారాజ్ సినిమాను హిందీ వెర్షన్ రిలీజ్ చేశారు. ఐతే బాలయ్య సినిమాను చూసిన హిందీ ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వస్తుంది. మన దగ్గరతో పోల్చితే మాస్ సినిమాలను ఆదరించే ప్రేక్షకులు తక్కువే. ఐతే వాళ్లు నచ్చే మాస్ వేరే రకంగా ఉంటాయి. డాకు మహారాజ్ యాక్షన్ సీన్స్ ఆడియన్స్ కు మంచి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ లాంటి సీనియర్ హీరో నుంచి ఇలాంటి ఫైట్స్ అసలు ఊహించలేదు. తెలుగులో సినిమా సక్సెస్ అవ్వగా హిందీ రిలీజ్ కి డిమాండ్ పెరిగింది. సో కమర్షియల్ లెక్కలు ఏమి లేకుండా ఎంత వచ్చినా లాభమే అని చెప్పొచ్చు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్, ప్రగ్యా జైశ్వాల్ నటించారు. బాలీవుడ్ భామ ఊర్వశి రౌతెలా కూడా ఈ సినిమాలో నటించింది కాబట్టి హిందీ ఆడియన్స్ కు అదొక స్పెషల్ క్రేజ్ అని చెప్పొచ్చు. డాకు మహారాజ్ హిందీ రిలీజ్ డే టాక్ పర్వాలేదు అన్నట్టుగా ఉండగా సినిమా తో బాలయ్యకు అక్కడ కూడా సూపర్ ఫ్యాన్స్ ఏర్పడేలా ఉన్నారు.

## ఒళ్లు హూనమైనా రెండు గంటలు ఆ పని తప్పనిసరి!





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హార్డ్ వర్క్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రతీ సినిమాలోనూ అతడి కష్టం తెరపై కనిపి స్తుంది. అందుకే అంత పెద్ద స్టార్ అయ్యాడు. జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డులు..రివార్డులు అందుకున్నాడు. అలాగే బన్నీ మంచి ఫిట్ నెస్ ప్రియుడు కూడా. నిత్యం తనని పిట్ గా ఉండేలా చూసుకుంటాడు. క్రమం తప్పకుండా రెండు పూటలా జిమ్ చేయడం అలవాటు. అలాగే ఆహారం విషయంలోనే అంతే జాగ్రత్తలు తీసుకుంటాడు. అలాగని అతడికి ఆకలేస్తే స్టార్ హెూట్ ల్ లోనే తినాలనే మి ఉండదు. పూరి గుడిసెలోనైనా? సమయానికి తనకి కావాల్సిన ఆహారం తీసుకుంటాడు. అది అతడిలో ఉన్న గొప్ప లక్షణం. అతడిలో ఉన్న డౌన్ టూ ఎర్త్ క్వాలిటీ. ఇది అందరికీ తెలిసిందే. సాధారణంగా ఉదయం నుంచి సాయంత్ర వరకూ షూట్ లో పాల్గొంటే అలసిపోతారు .అలాంటి సమయంలో మళ్లీ జిమ్ చేయడం అన్నది సాధ్యం కాదు. కానీ బన్నీ అలాంటి టైప్ కాదు. ఎంత అలసిపోయినా? సరే సాయంత్రం ఇంటికొచ్చి రెండు గంటల పాటు జిమ్ క్రమం తప్పకుండా చేస్తాడు. ఇన్ డోర్ షూటింగ్ అయినా..ఔట్ డో ర్ షూటింగ్ అయినా జిమ్ మాత్రం మిస్ అవ్వడుట. పుష్ప-2 షూటింగ్ సమయంలో సాయంత్ర వరకూ అడవిలో షూటింగ్ చేసినా..ఎంతో కఠినమైన షూటింగ్ జరిగినా... షూటింగ్ లో ఒళ్లు హూనమైపోయినా? హెూటల్ కి వచ్చిన వెంటనే జిమ్ కి వెళ్లిపోయేవాడని రష్మిక మందన్న ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేసింది. అతడిలో ఆ రకమైన డెడికేషన్ చూసి ఫిదా అయిపోయానని సంతోషం వ్యక్తం చేసింది. ఐదేళ్ల పాటు ఒకే హీరోతో కలిసి నటించడం తన కెరీర్ లో ఇదే మొదటిసారని తెలిపింది. పుష్ప మొదటి, రెండు భాగాల్లో బన్నీకి జోడీగా రష్మిక నటించిన సంగతి తెలిసిందే. రెండు సినిమాలు పాన్ ఇండియాలో బ్లాక్ బస్టర్ అయ్యాయి. ముఖ్యంగా రెండవ భాగమైతే ఇప్పుడెలాంటి దూకుడు చూపిస్తుందో తెలిసిందే.

## ఆ హీరోతో నటించాలని భాగ్యం డ్రీమ్..!

సంక్రాంతికి వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యం రోల్‌లో నటించిన ఐశ్వర్య రాజేష్ కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌తో అలరించింది. అంతే కాకుండా ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. కామెడీతో ఆకట్టుకున్న ఐశ్వర్య రాజేష్ ముందు ముందు టాలీవుడ్‌లో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో ఐశ్వర్య రాజేష్ అడుగు పెట్టి చాలా కాలం అవుతున్నా ఇంత మంచి పాత్ర దక్కలేదు, ఈ స్థాయి హిట్ పడలేదు. రెండు ఒకే సినిమాతో దక్కడంతో ఐశ్వర్య రాజేష్ ఫుల్ హ్యాపీగా ఉంది. కోలీవుడ్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తున్న ఐశ్వర్య రాజేష్ టాలీవుడ్‌లోనూ సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నట్లు చెప్పుకొచ్చింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... తనకు ఎన్టీఆర్ అంటే చాలా అభిమానం. ఆయన్ను స్టూడెంట్ నెం. 1 సినిమా అప్పటి నుంచి చూస్తూ వస్తున్నాను. ఆయన డాన్స్ అంటే చాలా ఇష్టం. ఆయనతో నటించే అవకాశం వస్తే కచ్చితంగా వదులుకోను. తారక్ డైలాగ్ డెలివరీ, డాన్స్, యాక్టింగ్ అంటే తనకు చాలా ఇష్టమంది. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్‌లో ఆయన నటించే తీరు నాకు చాలా బాగా నచ్చుతుందని చెప్పుకొచ్చింది. ఆయనతో వర్క్ చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఆ అవకాశం ఇప్పటి వరకు రాలేదు.



భవిష్యత్తులో వస్తే కచ్చితంగా వదులుకోకుండా చేస్తాను అంటూ ఐశ్వర్య రాజేష్ చెప్పుకొచ్చింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యం పాత్రలో చీర కట్టులో కనిపించి గ్లామర్ షో చేసిన మీనాక్షి చౌదరికి పోటీ ఇచ్చింది. ఆమె అందాన్ని చూపిస్తున్నా ఈమె ఎక్కడ తగ్గకుండా తన నటనతో చూపు తన వైపు తిప్పుకుంది. సినిమా ప్రమోషన్ సమయంలోనూ దర్శకుడు అనిల్ రావిపూడికి పూర్తిగా సహకరించి సినిమా ప్రమోషన్‌లో తనవంతు పాత్ర పోషించింది. తక్కువ సమయంలోనే సినిమా భారీ వసూళ్లు సొంతం చేసుకోవడంలో కచ్చితంగా భాగ్యం పాత్ర కీలకం అనడంలో సందేహం లేదు. దర్శకుడు అనిల్ రావిపూడి సైతం ఈ సినిమా విజయంలో ఐశ్వర్య పాత్ర కీలకం అన్నట్లుగా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం తమిళ్‌లో పలు సినిమాలను చేస్తోంది. తెలుగులో మాత్రం ఇప్పటి వరకు కొత్త సినిమాకు కమిట్ కాలేదు. ఈ సినిమా హిట్ నేపథ్యంలో ఇకపై వరుసగా ఫ్యామిలీ ఓరియంటెడ్ పాత్రలే ఈమెకు దక్కే అవకాశం ఉందని కొందరు అంటున్నారు. అయితే యంగ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు వస్తాయా అనేది చూడాలి. ఎన్టీఆర్‌తో ఈమె నటించాలని కోరుకుంటున్నప్పటికీ అది ఎంత వరకు సాధ్యం అనేది చూడాలి. ఎన్టీఆర్ వంటి స్టార్ మాస్ హీరోతో నటించే అవకాశం రావడం కచ్చితంగా చాలా పెద్ద విషయం. మరి ఆ పెద్ద ఆఫర్ ఐశ్వర్య రాజేష్‌కి వస్తుందా అనేది చూడాలి.

## పంజాబీ బ్యూటీ డబుల్ ధమాకా!

పంజాబీ బ్యూటీ సోనమ్ బజ్వా టాలీవుడ్ కు సుపరిచితమే. బాబు బంగారంలో ఐటం పాటతో ప్రేక్షకుల్ని అలరించింది. అటుపై ఆటాడుకుందారా, బోర్న్ టూ బి కింగ్ లాంటి చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలు చేయలేదు. ఎక్కువగా పంజాబీ చిత్రాల్లోనే నటించింది. తమిళ్, హిందీలో కొన్ని సినిమాలు చేసింది. అయితే సొంత భాషలో సక్సెస్ అయినంతగా ఇతర భాషల్లో సక్సెస్ అవ్వలేదు. దీంతో సోనమ్ బజ్వా అంతగా ఫేమస్ కాలేపోయింది. అయితే అమ్మడికిప్పుడా ఛాన్స్ ముందుంది. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ హౌస్ ఫుల్ నటించే అవకాశం దక్కించు కుంది. హౌస్ ఫుల్ 5లో నటించే అవకాశం వచ్చింది. అలాగే మరో హిట్ ఫ్రాంచైజీ భాఘీలోనూ ఛాన్స్ అందుకుంది. బాఘీ-4లో చాన్స్ వచ్చింది. ఈ రెండు చిత్రాల్ని నిర్మించేది సాజిద్ నడియావాలా. ఆయనే సోనమ్ బజ్వాకి తన నిర్మాణ



సంస్థలో ఈ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఈ రెండు సినిమాలు కూడా అమ్మడికి డెబ్యూలు అనే అనాలి. బాల అనే హిందీ చిత్రంలో నటించినప్పటికీ అందులో అమ్మడి పాత్ర కూడా చిన్నది. సినిమా పెద్ద హిట్ అయినా సోనమ్ బజ్వాని గుర్తుపట్టడం కష్టమే అన్నట్లుగా ఉంటుంది. అందులో హీరోయిన్ గా భూమీ పడ్నే కర్ నటించింది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించగా, యామీ గౌతమ్ మరో హీరోయిన్ గా నటించింది. వీళ్లందరి మధ్యలో సోనమ్ బజ్వా పాత్ర హైలైట్ కాలేదు. అయితే తాజా అవకాశం ఆస్యమైనా బాఘీ, హౌస్ ఫుల్ లాంటి ఫ్రాంచైజీలతో కంబ్యాక్ అవ్వడంతో? అమ్మడు బాగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ సినిమాలు సక్సెస్ అయితే మరిన్ని కొత్త అవకాశాలకు ఆస్కారం ఉంది.




హైదరాబాద్: ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ధి చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు. ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు.

42 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన తెలంగాణ హైకోర్టులో ప్రస్తుతం 26 మంది సేవలందిస్తున్నారు. ఈ నలుగురి నియామకంతో ఆ సంఖ్య 30కి చేరింది.




హైదరాబాద్: ప్రాజెక్టుల పనులు ప్రారంభించేముందు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలపై లేదా అని కాళేశ్వరం విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని అడగాలని.. ముందే జాగ్రత్తలు తీసుకొని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు.

అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లికార్జునరావు, శేఖర్ దాస్ ..కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజర య్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై వారిని ప్రశ్నించారు. బ్యారేజీ ప్రతిపాదిత లొకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గం కూడా లేకపోవడంతో ఏడాది పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసేటప్పుడు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని.. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించింది. వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునేవాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదలశాఖతో సంప్రదింపులు జరిపినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.

సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సల్టెన్సీతో అధ్యయనం చేయించామని.. ఆ సిఫార్సులపై నీటిపారుదల శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదని, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్లు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్ ముందు తెలిపారు.




కరీంనగర్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఆవాస్ యోజన) పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. "ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపాదే. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నా. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు" అని బండి సంజయ్ దుయ్యబట్టారు.

## లైంగిక బంధానికి పరస్పర అంగీకారం.. దాడి చేసేందుకు లైసెన్స్ కాదు: కర్ణాటక హైకోర్టు

బెంగళూరు: పరస్పర సమ్మతితో కొనసాగించే లైంగిక బంధాన్ని అత్యాచారం కింద పరిగణించలేమని కర్ణాటక హైకోర్టు పేర్కొంది. తనపై ఓ మహిళ చేసిన ఆరోపణలకు వ్యతిరేకంగా ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ వేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అతడిపై వచ్చిన అత్యాచార ఆరోపణలను కొట్టివేసింది. అశోక్‌కుమార్ 2017 నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. నాటినుంచి ఓ మహిళతో సన్నిహిత సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే.. అతడు తనను శారీరక, లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ 2021 మేలో సదరు మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను ఇచ్చిన కంప్లైంట్‌ను వెనక్కి తీసుకోకపోతే.. తన పిల్లలకు హాని చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. 2021 నవంబర్‌లో తనను ఓ హొటల్‌కు తీసుకెళ్లి.. బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. అనంతరం తనను సమీపంలోని బస్‌స్టాప్‌లో వదిలివెళ్లినట్లు పేర్కొంది. ఆ తర్వాత ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. కాగా, తనపై మహిళ చేసిన అభియోగాలకు వ్యతిరేకంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. "పరస్పర అంగీకారంతో కొనసాగిన లైంగిక సంబంధాన్ని అత్యాచారంగా పరిగణించలేం. అయితే.. పరస్పర అంగీకార చర్యలు అంటే మహిళపై దాడి చేయడానికి పురుషుడికి లైసెన్స్ ఇచ్చినట్లు కాదు" అని పేర్కొన్న న్యాయస్థానం ఇన్‌స్పెక్టర్‌పై అత్యాచార అభియోగాలను కొట్టివేసింది. కానీ, దాడి, బెదిరింపులు, హత్యాయత్నం అభియోగాలను కోర్టు సమర్థించింది. ఈ అంశంపై అతడు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది అని తెలిపింది.




హైదరాబాద్: గడిచిన నాలుగు రోజులు తన నివాసం, కార్యాలయాల్లో జరిగిన ఐటీ సోదాలను ఉద్దేశించి ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. "ఈ నాలుగు రోజుల నుంచి ఈ విషయంపై ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీతెలియని విషయాలతో దీనిని బాగా హైలైట్ చేస్తున్నారు. 2008లో ఒకసారి ఆదాయపు పన్నుశాఖ దాడులు చేసింది. దాదాపు 16 ఏళ్ల తర్వాత ఇప్పుడు మా ఇళ్లు, కార్యాలయాలపై ఈ దాడులు జరిగాయి. మధ్యలో మూడుసార్లు సర్వేలు చేసి అకౌంట్ బుక్స్ చెక్ చేశారు. వ్యాపార రంగంలో ఉన్నవారిపై ఇలాంటి దాడులు సాధారణం. ఈ దాడుల్లో మా ఇల్లు, కార్యాలయంలో ఇంత డబ్బు దొరికింది.. ఏవేవో డాక్యుమెంట్లు దొరికాయి అంటూ కొన్ని ఛానల్స్‌లో వార్తలు హైలైట్ చేశారు. మా దగ్గర అలాంటిది ఏమీ జరగలేదు. మావద్ద ఎలాంటి అనధికారిక డాక్యుమెంట్లు, డబ్బును అధికారులు గుర్తించలేదు" అని దిల్ రాజు తెలిపారు. "నా వద్ద రూ.5 లక్షలు, శిరీష్ వద్ద రూ.నాలుగున్నర లక్షలు, మా కుమార్తె వద్ద రూ.ఆరున్నర లక్షలు, ఆఫీస్‌లో రూ.రెండున్నర లక్షలు.. ఇలా మొత్తం సుమారు రూ.20 లక్షల కంటే తక్కువే డబ్బు ఉంది. అది కూడా అనధికార డబ్బు కాదు. దానికి కూడా డాక్యుమెంట్స్ ఉన్నాయి. లిమిట్స్ ప్రకారమే బంగారం కూడా ఉంది. ఐదు సంవత్సరాల నుంచి మేము ఎక్కడా ప్రోపర్టీలు కొనుగోలు చేయలేదు. పెట్టుబడులు పెట్టలేదు. బిజినెస్ విషయంలో వారికి అన్ని వివరాలు ఇచ్చాం. 24 క్రాఫ్టుల్లో లావాదేవీలు ఎలా జరిగాయనేది చెప్పాం. డిపార్ట్‌మెంట్ కూడా ఆశ్చర్యపోయింది. ఈ దాడులకు మేము పూర్తిగా సహకరించాం. అందరి అకౌంట్ విషయాలు క్లీన్‌గా ఉన్నాయి. అమ్మకు 19వ తేదీన జలుబు, దగ్గు ఎక్కువైంది. సడెన్‌గా దగ్గు ఎక్కువ కావడంతో ఆస్పత్రికి పంపించాం. ఆమెకు గుండెపోటు అన్నట్లు కొంతమంది వార్తలు రాశారు. ఆమె చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఆమెకు 81 ఏళ్లు. రెండు రోజులు ఆస్పత్రిలో ఉన్నారు. ఇప్పుడు డిశ్చార్జి అవుతారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ వల్ల దగ్గు ఎక్కువగా వచ్చింది. దానికి సంబంధించి ఆమె ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. మీకు తెలిసీ తెలియని విషయాల గురించి హైలైట్ చేయొద్దు అని మరోసారి మీడియాను కోరుతున్నా" అని దిల్ రాజు విజ్ఞప్తి చేశారు.

ఏమీ లేని దానికి ఎక్కువగా ఊహించుకొని హైలైట్ చేస్తున్నారని ఆయన అన్నారు. ఫేక్ కలెక్షన్స్ వల్లే ఐటీ సోదాలు జరుగుతున్నాయని వస్తోన్న వార్తలపై స్పందించారు. "ఇండస్ట్రీలోని అందరూ కలిసి దానిపై మాట్లాడతాం. ఆ విషయంపై నేను వ్యక్తిగతంగా కామెంట్ చేయకూడదు. అలాంటిది ఏమైనా ఉంటే ఇండస్ట్రీ తరఫున కరెక్ట్ చేయాల్సి ఉంది. 90శాతం టికెట్లు ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. బ్లాక్‌మనీ సమస్య లేదు" అని ఆయన తెలిపారు.




పోచారం: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి దివ్యానగర్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇక్కడి లేఅవుట్స్‌లో రహదారికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడలను సిబ్బంది కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ నెల 12న హైడ్రా కమిషనర్ రంగనాథ్ దివ్యానగర్ లేఅవుట్స్‌ను పరిశీలించారు. అక్రమ కట్టడాల నిర్మాణంపై ఆరా తీశారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించారని గుర్తించారు. తాజాగా శనివారం వాటి కూల్చివేతలు చేపట్టారు.




## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. ఇకపై ఇంటికి వెళ్లడం మరింత సులభం

**హైదరాబాద్: ప్రయాణికులకు భాగ్యనగరం మెట్రో మరో శుభవార్త చెప్పింది. ప్రయాణికులు స్టేషన్ నుంచి గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని సులభతరం చేసింది. కాలుష్య రహిత వాహనాలను మెట్రో స్టేషన్‌తో అనుసంధానం చేసింది. ఇకపై మెట్రో నుంచి ఇళ్లు, కార్యాలయం, కళాశాలలకు వెళ్లే వారు సొంత వాహనాలను వాడాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. ఈవీ జీప్ వాహనాలతో తమ గమ్యస్థానాలను చేరుకోవచ్చని హామీ ఇస్తోంది.**

## ప్రతి కుంభకోణం వెనక గంగుల పాత్ర ఉంది: కరీంనగర్ మేయర్



కరీంనగర్: భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌పై కరీంనగర్ మేయర్ సునీల్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో భాజపాలో చేరిన అనంతరం సునీల్ రావు మాట్లాడారు. "తెదేపా నుంచి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ గంగుల కమలాకర్ ఆర్థిక పరిస్థితి ఏంటి? టెండర్ల తర్వాత కమీషన్లు ముడితే చాలు.. ఆ తర్వాత గంగుల కనిపించరు. ఆ పనుల గురించి అసలు పట్టించుకోరు. కరీంనగర్‌లో జరిగిన ప్రతి కుంభకోణం వెనక ఆయన పాత్ర ఉంది. బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ నగర అభివృద్ధి జరిగింది. కరీంనగర్ అభివృద్ధిని గంగుల కమలాకర్ ఏనాడూ పట్టించుకోలేదు. డ్రైనేజీ నీళ్లు మళ్లించకుండా మానేరు రివర్ ఫ్రంట్ పేరిట నిధులు వృథా చేశారు. నగర అభివృద్ధి ఆగిపోవద్దని నేను ఇంతకాలం సైలెంట్‌గా ఉన్నా. చెక్‌డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోయాయి? చెక్‌డ్యామ్‌లు, రోడ్ల కాంట్రాక్టర్లంతా గంగుల బినామీలే. నాకు మేయర్ పదవి రాకుండా ఆనాడే అడ్డుపడ్డారు. కేవలం కేంద్ర నిధులతోనే నగర అభివృద్ధి జరిగింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేస్తాం. మరికొంత మంది కార్పొరేటర్లు భాజపాలో చేరుతారు" అని సునీల్‌రావు తెలిపారు.

## ఆ చిత్రాలకు ఎప్పుడూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: అర్థవంతమైన కథతో ప్రేక్షకుల ముందుకొచ్చే చిత్రాలకు తప్పకుండా ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. భారీ బడ్జెట్‌తో సినిమా తీశామని, టికెట్ ధరలు, అదనపు షోల అనుమతి కోసం కాకుండా కథాబలం ఉన్న చిత్రాలపై సినీ పరిశ్రమ దృష్టి సారించాలని సూచించారు. అలాగే వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంపై మంత్రి కోమటిరెడ్డి ప్రశంసలు కురిపించారు. చిన్న చిత్రంగా విడుదలై భారీ చిత్రాలతో సమానంగా వసూళ్లు సాధించిందన్నారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా ఎస్పీ చరణ్ ప్రధాన పాత్రలో నటించిన 'లవ్ యువర్ ఫాదర్' చిత్ర టీజర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నటీనటులు, దర్శక నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలిపారు.




Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com